సాక్షి
మహబూబ్‌నగర్

శుక్రవారం । 15 । మార్చి । 2024

I



అందుబాటులోకి వచ్చేనా..?

పాలమూరులో ఏర్పాటు చేసిన వాలీబాల్ అకాడమీ నిరుపయోగంగా మారింది.

వివరాలు IVలో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-33 (శుక్రవారం సాయంత్రం)


సహర్ 5-04 (శనివారం తెల్లవారుజామున)

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.5 /20.2

ఆకాశం నిర్మలంగా ఉంటూ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

‘కమలానికి’ బై బై..





బీజేపీని వీడనున్న ఏపీ జితేందర్‌రెడ్డి!

- మహబూబ్‌నగర్ టికెట్ డీకే అరుణకు ఖరారుతో అసంతృప్తి
- హైదరాబాద్‌లో ఆయన ఇంటికి వెళ్లిన ముఖ్యమంత్రి
- కాంగ్రెస్‌లో చేరాలని ఆహ్వానించిన రేవంత్‌రెడ్డి
- మల్కాజిగిరి లేదా చేవెళ్ల నుంచి పోటీకి అవకాశం
- మరోవైపు శాంతికుమార్‌పై బీసీ నేతల ఒత్తిళ్లు
- స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలవాలని డిమాండ్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ పార్లమెంట్ నుంచి బీజేపీ టికెట్ ఆశించిన ఆ పార్టీ సీనియర్ నేత, జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి అసంతృప్తితో ఉన్నారా? మాజీ మంత్రి డీకే అరుణకు టికెట్ ఖరారైన నేపథ్యంలో ఓ నిర్ణయానికి వచ్చారా..? కమలానికి షాక్ ఇవ్వనున్నారా..? అంటే అవుననే సమాధానం రాజకీయ వర్గాల నుంచి వ్యక్తమవుతోంది. గురువారం హైదరాబాద్‌లో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి.

మల్కాజిగిరి లేదా చేవెళ్ల నుంచి పోటీ..

జితేందర్‌రెడ్డిని కాంగ్రెస్‌లో చేరిన పక్షంలో మల్కాజిగిరి లేదా చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం ముమ్మరంగా సాగుతుంది. సర్వేల ఆధారంగానే కాంగ్రెస్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కాగా, ఉమ్మడి పాలమూరులో బీజేపీ పటిష్టతకు జితేందర్‌రెడ్డి కృషి చేశారని.. మహబూబ్‌నగర్ ఎంపీ టికెట్ ఇవ్వకపోవడం దారుణమని.. పార్టీ అధిష్టాన నిర్ణయం తమకు అసంతృప్తి మిగిల్చిందని.. కాంగ్రెస్‌లో చేరే అవకాశాలే ఎక్కువ అని ఆయన అనుచరులు చెబుతున్నారు. ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డిని ‘సాక్షి’ ఫోన్‌లో సంప్రదించగా.. ‘ఎంపీ టికెట్ రాకపోవడంతో బాధలో ఉన్నా.. నన్ను పరామర్శించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి వచ్చారు.. చెబుతా.. నిర్ణయం తీసుకున్న తర్వాత చెబుతా’ అని ముక్తసరిగా సమాధానం ఇచ్చారు. ఇదిలా ఉండగా.. హైదరాబాద్‌లో గురువారం మధ్యాహ్నం జితేందర్‌రెడ్డి ఇంటికి సీఎం రేవంత్‌రెడ్డి వెళ్లగా.. అంతకంటే రెండు గంటల ముందు జితేందర్‌రెడ్డి తనయుడు, మిథున్‌రెడ్డి మహబూబ్‌నగర్‌లో డీకే అరుణ నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో పాల్గొనడం విశేషం.

జితేందర్‌రెడ్డి ఇంటికి సీఎం..

మహబూబ్‌నగర్ లోక్‌సభ బీజేపీ టికెట్ కోసం మాజీ మంత్రి, ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణతో పాటు జితేందర్‌రెడ్డి, ఆ పార్టీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతి కుమార్ తొలి నుంచీ ముమ్మరంగా ప్రయత్నించిన విషయం తెలిసిందే. వీరి మధ్య టికెట్ పోరు తీవ్రంగా ఉండడంతో పార్టీ అధిష్టానం నిన్న, మొన్నటి వరకు పెండింగ్‌లో పెట్టింది. ఈ నెల రెండో తేదీన తెలంగాణలో పలు ఎంపీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తూ తొలి జాబితా విడుదల చేసినా.. మహబూబ్‌నగర్ అభ్యర్థిని ప్రకటించలేదు. ఆ తర్వాత బుధవారం మహబూబ్‌నగర్ అభ్యర్థిగా డీకే అరుణను ఖరారు చేస్తూ రెండో జాబితా ప్రకటించడంతో జితేందర్‌రెడ్డి, ఆయన వర్గీయుల్లో అసంతృప్తి నెలకొంది. ఈ క్రమంలో గురువారం హైదరాబాద్‌లోని ఆయన ఇంటికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెళ్లడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా కాంగ్రెస్‌లో చేరాలని, సముచిత స్థానం కల్పిస్తామని జితేందర్‌రెడ్డికి సీఎం హామీ ఇచ్చినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

శాంతికుమార్‌పై బీసీ నేతల ఒత్తిళ్లు

మరోవైపు బండారి శాంతికుమార్ సైతం మహబూబ్‌నగర్ టికెట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో రెండు పర్యాయాలు టికెట్ ఆశించినా.. పార్టీ అధిష్టాన నిర్ణయం మేరకు త్యాగం చేశానని.. ఈసారి తనకు అవకాశం వస్తుందనే నమ్మకంతో బీసీ నినాదంతో పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో విస్తృత పర్యటనలు చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన వాటితో పాటు పాలమూరు మోదీ పేరిట పోస్టర్లు ముద్రించి ఇంటింటికీ అంటించారు. అయితే ఈసారి సైతం భంగపాటు ఎదురుకావడంతో శాంతికుమార్ అసంతృప్తితో ఉన్నారు. ఈక్రమంలో మహబూబ్‌నగర్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలవాలని బీసీ నేతలు ఆయనపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలిసింది. లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్న బీజేపీ అధిష్టానం ఈ రాజకీయ పరిణామాలను గమనించడంతో పాటు ఎప్పటికప్పుడు ముఖ్య నేతలతో టచ్‌లో ఉంటున్నట్లు సమాచారం.

న్యూస్‌రీల్

ముగిసిన ఇంటర్ పరీక్షలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా 15 రోజులపాటు కొనసాగిన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు గురువారంతో ప్రశాంతంగా ముగిశాయి. పరీక్షలు ప్రారంభం నుంచి ముగింపు వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సవ్యంగా సాగడంతో అన్ని స్థాయిలో పనిచేసిన సిబ్బందిని డీఐఈఓ శ్రీధర్ సుమన్ అభినందించారు. చివరిరోజు జిల్లావ్యాప్తంగా 33 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. రెండో సంవత్సరం విద్యార్థులకు సైన్స్ కోర్సుల వారికి కెమిస్ట్రీ, ఆర్ట్స్ వారికి కామర్స్ పరీక్షలు కొనసాగాయి. ఇందులో 9,322 మందికి గాను 9,090 మంది హాజరవగా.. 232 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ మేరకు పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్, డీఈసీ బృందం సభ్యులు పరిశీలించారు. పరీక్షలు ముగియడంతో వివిధ ప్రైవేట్, ప్రభుత్వ కళాశాలల్లో చదువుతూ హాస్టళ్లలో ఉండే విద్యార్థులు ఇంటిబాట పట్టారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



స్టేషన్ మహబూబ్‌నగర్: రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని పాలమూరు రెడ్డి సేవా సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు తూము ఇంద్రసేనారెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని రాజా బహదూర్ రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో పేద రెడ్ల పోరాటాన్ని గుర్తించి తమ మేనిఫెస్టోలో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన వెంటనే క్యాబినెట్ సమావేశంలో కార్పొరేషన్ ఏర్పాటును ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులకు ధన్యవాదాలు తెలుపుతున్నామని, చట్టబద్ధతతో కూడిన రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి పేద రెడ్ల కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఈ నెల 17న స్థానిక రెడ్డి కన్వెన్షన్‌లో పాలమూరు రెడ్డి సేవా సమితి 22వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నామని, ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రెడ్డి బంధువులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు. సమావేశంలో సమితి ప్రధాన కార్యదర్శి వేపూరు రాజేందర్‌రెడ్డి, కోశాధికారి మల్లు నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులు జి.వెంకట్రామరెడ్డి, కార్యదర్శి కోటేశ్వర్‌రెడ్డి, సలహాదారు పోతుల రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లాగ్ మార్చ్‌తో ప్రజల్లో నమ్మకం

మహబూబ్‌నగర్ క్రైం: ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం ద్వారా ప్రజల్లో శాంతిభద్రతలను రక్షించడంలో మరింత నమ్మకం పెరుగుతుందని ఏఆర్ ఏఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాజులపేట, అల్లీపూర్, రామచంద్రాపూర్ గ్రామాల్లో గురువారం కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ గాంధీనాయక్, ఎస్ఐ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆముదాలు క్వింటాల్ రూ.5,619

దేవరకద్ర: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం జరిగిన టెండర్లలో ఆముదాలు క్వింటాల్‌కు గరిష్టంగా రూ.5,619, కనిష్టంగా రూ.5,571గా ధరలు లభించాయి. మార్కెట్‌లో సీజన్ లేకపోవడంతో చాలా తక్కువ మొత్తంలో ఆముదాలు అమ్మకానికి వచ్చాయి. ఇతర ధాన్యాల లావాదేవీలు జరగలేదు.

సమస్యల పరిష్కారానికి సీఎం సానుకూలం

- మన్నె జీవన్‌రెడ్డికి మద్దతుగా నిలవడం సంతోషం ఉంది
- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

స్టేషన్ మహబూబ్‌నగర్: స్థానిక సంస్థల ప్రతినిధుల సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డితో ఇటీవలే మాట్లాడగా.. సానుకూలంగా స్పందించినట్లు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక సంస్థల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డితో కలిసి మంత్రి గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు కేరళ రాష్ట్రంలో స్థానిక సంస్థల పరిస్థితులను చూశామని.. అక్కడికి, ఇక్కడికి చాలా వ్యత్యాసం ఉందన్నారు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేలతోపాటు స్థానిక సంస్థల ప్రతినిధులకు సచివాలయానికి పోలేని పరిస్థితి ఉండేదన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంపీటీసీల నుంచి నామినేషన్ వేసిన విషయం తన దృష్టికి వచ్చిందని, సీఎంతో మాట్లాడి నిధులు, విధులు ఇవ్వాలని కోరానన్నారు. ప్రభుత్వంపై విశ్వాసంతో ఎంపీటీసీ ఫోరం ప్రతినిధులు నామినేషన్ విత్‌డ్రా చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఎంపీటీసీల ఫోరం ప్రతినిధులు తమ సమస్యలను తెలిపేందుకు సీఎంతో మాట్లాడించేలా చూస్తానన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీతోపాటు రెండు పార్లమెంట్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందన్నారు. రాష్ట్రంలో 13 నుంచి 14 ఎంపీ స్థానాలు గెలుస్తామని, బీఆర్ఎస్ కనుమరుగవడం ఖాయమన్నారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు బీజేపీ జాతీయ హోదా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. జితేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి వస్తున్నారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు జూపల్లి సమాధానమిస్తూ రేవంత్‌రెడ్డి జితేందర్‌రెడ్డి ఇంటికి వెళ్లడం అంటే కాంగ్రెస్‌లోకి ఆహ్వానించడమే అన్నారు. ఆయనకు టికెట్ రాకపోవడం బాధాకరమని, బీజేపీ ఆయనకు అన్యాయం చేసిందన్నారు. రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు గడీల కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలకు తమ సమస్యలు విన్నవించుకున్నా పట్టించుకోలేదన్నారు. ఇటీవలే రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసుకొని స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా పోటీ చేయాలనే ఉద్దేశంతో నామినేషన్లు దాఖలు చేశామన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం సీఎంతో మాట్లాడిస్తామని చెప్పడంతో నామినేషన్లు విత్‌డ్రా చేయడం జరిగిందన్నారు. సీఎంతో కలిసి మాట్లాడిన తర్వాత ఫోరం తరఫున ఎన్నికల్లో పూర్తిగా సహకారం అందిస్తామని చెప్పారు. సమావేశంలో ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్, నాయకులు వినోద్‌కుమార్, ఎస్పీ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

‘బీఆర్ఎస్ పార్టీదే అంతిమ విజయం’



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): స్థానిక సంస్థల ఎమ్మెల్సీని బీఆర్ఎస్ గెలుస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం జెడ్పీ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో వెయ్యికి పైగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్‌కు చెందిన వాళ్లు ఉన్నారన్నారు. ఇందులో కొంతమంది పార్టీలు మారినా.. అంతిమంగా బీఆర్ఎస్ పార్టీ స్థానిక సంస్థ ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి గెలుపొందడం ఖాయమన్నారు. గతంలో ఉమ్మడి జిల్లాకు నవీన్‌కుమార్‌రెడ్డి జెడ్పీ వైస్‌చైర్మన్‌గా పనిచేసిన అనుభవం ఉందన్నారు. స్థానిక సంస్థల్లో పాలనాపరమైన అనుభవం ఉందని, ఆయన గెలిస్తేనే న్యాయం జరుగుతుందన్నారు. ఎమ్మెల్సీగా గెలిచి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ప్రతినిధుల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ పోటీలో నిలబడి అప్రజాస్వామికంగా గెలవాలని చూస్తుందని ఆరోపించారు. అధికార పార్టీ ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా తమ పార్టీ ప్రజాప్రతినిధులు లొంగరని, ప్రజాస్వామికబద్ధంగా ఎన్నిక జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో కోయిల్‌కొండ జెడ్పీటీసీ సభ్యుడు విజయ్‌భాస్కర్, ఎంపీపీ శశికళ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి..



మాట్లాడుతున్న డీకే అరుణ

పాలమూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు కాగితాల్లో.. మీడియా ప్రచారాల్లో తప్ప క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో అట్టర్ ప్లాప్ అయ్యిందని బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ ఎద్దేవా చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని చెబుతూ మోసపూరిత, అబద్ధపు హామీలతో ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ధ్వజమెత్తారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పెద్దఎత్తున బస్సులు లేవని, కేవలం పట్టణాల్లో కొంతమేర మహిళలు లబ్ధి పొందారన్నారు. ప్రతి గృహిణికి ప్రతినెలా రూ.2,500 అందిస్తామని, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల కరెంట్, నిరుద్యోగులకు రూ.4 వేల భృతి, రైతుబంధు, కౌలు రైతులకు రూ.12 వేలు ఇస్తానని చెప్పి అన్ని రకాలుగా మోసం చేశారని విమర్శించారు. మళ్లీ ఇప్పుడు కొత్తగా రాష్ట్రంలోని 17 పార్లమెంట్ స్థానాలు గెలిపిస్తే ఢిల్లీలో అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు అమలు చేస్తామని సీఎం చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే పరిస్థితులు ఏమాత్రం లేవని, మూడోసారి మోదీ ప్రధాని కాబోతున్నాడని అన్ని సర్వేలు, మేధావులు చెబుతున్నారన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో తక్కువ మెజార్టీతో ఓటమి పొందానని, ఈసారి ప్రజలు విజయం అందిస్తారని ఆశిస్తున్నానని, పార్టీలకతీతంగా తనను ఆశీర్వదించాలని కోరారు. ఒక్కసారి అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పద్మజారెడ్డి, ఏపీ మిథున్‌రెడ్డి, బాలరాజు, కృష్ణవర్ధన్‌రెడ్డి, సత్యం, పవన్‌కుమార్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, అంజయ్య, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణహిత ఉత్పత్తులపై శిక్షణ



పర్యావరణహిత ఉత్పత్తులతో కళాశాల సిబ్బంది, విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్రం డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణ హిత ఉత్పత్తులపై నిర్వహించిన శిక్షణ పూర్తయ్యింది. ఈ మేరకు శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు వారు స్వయంగా తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ పర్యావరణహిత కవర్లు, బ్యాగ్‌లు, గృహాలంకారణ వస్తువుల ద్వారా పర్యావరణానికి నష్టం జరగదని, భవిష్యత్‌లో ఈ వస్తువులకు డిమాండ్ ఏర్పడుతుందన్నారు. డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు సర్టిఫికెట్ కోర్సు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్ర సమన్వయకర్త కోటానాయక్, అధ్యాపకులు అమీనా ముంతాజ్, సూరయ్యాజబీన్, సుధీర్, శ్వేతారాణి తదితరులు పాల్గొన్నారు.

జనన లోపాలు గుర్తించాలి

పాలమూరు: నవజాత శిశువుల్లో ఏర్పడే జనన లోపాలపై ప్రజలకు అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జీవన్ అన్నారు. ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో గురువారం డీఈఐసీ సెంటర్‌లో జాతీయ జనన (పుట్టుక) లోపాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ జీవన్ హాజరై మాట్లాడుతూ దేశవ్యాప్తంగా క్షేత్రస్థాయిలోకి వెళ్లి ప్రజలకు జనన లోపాల గురించి వివరించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో నెలరోజులపాటు జిల్లాలో క్షేత్రస్థాయిలోకి వెళ్లి అవగాహన కార్యక్రమాలు చేపడుతామని వివరించారు. పుట్టుకతో వచ్చిన లోపాలను గుర్తించి డీఈఐసీ సెంటర్‌కు పంపించి అవసరమైన శస్త్రచికిత్స చేయించుకోవాలన్నారు. అనంతరం ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ శంకర్ మాట్లాడుతూ ఈ నెలరోజులు వైద్యులతోపాటు ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఏదైనా పుట్టుక లోపాలు ఉన్న పిల్లలను గుర్తిసే డీఈఐసీకి రెఫర్ చేయాలని సూచించారు. అనంతరం పుట్టుక లోపాలు ఎలా గుర్తించాలి అనే అంశంపై శిక్షకులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీధర్‌రెడ్డి, గైనిక్ హెచ్ఓడీ డాక్టర్ రాధ, వైద్యులు నరేష్, విద్య, డీఈఐసీ మేనేజర్ దేవిదాస్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



స్థానిక సంస్థల ఎమ్మెల్సీ.. ఉపఎన్నిక బరిలో ముగ్గురు అభ్యర్థులు

- ముగిసిన ఉపసంహరణ గడువు
- నామినేషన్ల విత్‌డ్రా చేసుకున్న పది మంది అభ్యర్థులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలలో భాగంగా గురువారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియగా.. బరిలో ముగ్గురు అభ్యర్థులు నిలిచారు. స్క్రూటినీ తర్వాత 13 మంది ఉండగా.. 10 మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఫారం-6లో పత్రాలు దాఖలు చేస్తూ తమ నామినేషన్లు ఉపసంహరించుకుంటున్నట్లు పేర్కొన్నారు. స్వతంత్ర అభ్యర్థులైన మున్నూరు రవి, గడీల కుమార్ గౌడ్, ఎస్.కృష్ణ, గవినోళ్ల బలరాంరెడ్డి, విజయ్ మంగి, పి.సుమలత, ఎం.శంకర్‌నాయక్, మహ్మద్ రహీం ఖాన్, దేవీ రవీందర్, కొండా సుధాకర్‌రెడ్డి తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో ముగ్గురు అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీ నుంచి మన్నె జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి నవీన్‌కుమార్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా సుదర్శన్‌గౌడ్ పోటీలో నిలిచారు. కాగా పోటీలో ఉన్న అభ్యర్థులు శుక్రవారం నుంచి ఓటర్ల వేటలో నిమగ్నం కానున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నుంచి పోటీ చేస్తున్న వారు తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ఓటర్లను క్యాంపులకు తరలించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

పర్యవేక్షణ పట్టదు.. నిర్లక్ష్యం వీడరు

- ప్రభుత్వ పాఠశాలలను వేధిస్తున్న ప్రధాన సమస్యలు
- విధుల నిర్వహణలో తీరు మార్చుకోని ఉపాధ్యాయులు
- మల్దకల్ మండలంలో ఒకరిపై పోక్సో కేసు నమోదు
- విధులకు ఆలస్యంగా వచ్చారని వెంకటాపూర్ పాఠశాల టీచర్‌కు నోటీసులు
- వారం రోజుల క్రితం మహబూబ్‌నగర్ రూరల్‌లో ఒకరి సస్పెండ్

- వివరాలు IIలో..

రేపు కందనూలుకు ప్రధాని మోదీ

- జిల్లాకేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారసభకు హాజరు
- సభకు భారీ ఏర్పాట్లు.. జన సమీకరణలో కాషాయదళం



సభా ప్రాంగణం వద్ద బాంబుస్క్వాడ్ తనిఖీలు

సాక్షి, నాగర్‌కర్నూల్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ శనివారం కందనూలుకు రానున్నారు. జిల్లాకేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తా సమీపంలో నిర్వహించనున్న బీజేపీ భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగించనున్నారు. ప్రధాని పర్యటన సందర్భంగా బహిరంగ సభ కోసం భారీఎత్తున జనాన్ని సమీకరించే పనిలో బీజేపీ నేతలు నిమగ్నమయ్యారు. ఇప్పటికే పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజి ఆచారి, వనపర్తి జెడ్పీచైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ జక్కా రఘునందన్‌రెడ్డి, దిలీపాచారి తదితర నేతలు సభాప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించారు. నాగర్‌కర్నూల్ ఎంపీ రాములుతోపాటు ఆయన కుమారుడు, బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ జన సమీకరణపై ప్రత్యేకంగా దృష్టిపెట్టారు.

హామీలపై ఆశలు

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీజేపీ వడివడిగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో అభ్యర్థుల ప్రకటనతోపాటు ఎన్నికల ప్రచారాన్ని సైతం ప్రారంభించింది. సాక్షాత్తు దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీనే రంగంలోకి దిగి ఎన్నికల ప్రచార శంఖారావం పూరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే శనివారం నాగర్‌కర్నూల్‌లో నిర్వహించనున్న మోదీ బహిరంగ సభపై భారీ అంచనాలున్నాయి. ఈ సభావేదికగా పాలమూరుకు స్పష్టమైన హామీలు, ఎన్నికల నజరానాలు ప్రకటించే అవకాశం ఉందని ఆశిస్తున్నారు. ప్రధానంగా కేంద్రం పరిధిలో ఉన్న జాతీయ రహదారులు, రైల్వే లైన్, పరిశ్రమల ఏర్పాటు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల మంజూరుపై హామీలు గుప్పించనున్నట్లు తెలుస్తోంది. జిల్లాకేంద్రం నుంచి అచ్చంపేట, మద్దిమడుగు మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని మాచారం వరకు జాతీయ రహదారి నిర్మాణం, కల్వకుర్తి నుంచి సోమశిల మీదుగా నంద్యాల వరకు జాతీయ రహదారి పనుల్లో వేగం, బ్రిడ్జి నిర్మాణం, భూత్పూర్- శ్రీశైలం జాతీయ రహదారి, గద్వాల నుంచి సూర్యాపేట వరకు రైల్వేలైన్ మంజూరు వంటి పనుల ప్రతిపాదనలు ఉన్నాయి. అలాగే జిల్లాకేంద్రంలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో మూడు వరకు కేంద్రీయ విద్యాలయాల మంజూరు, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు అదనపు నిధులు కావాలన్న డిమాండ్లు ఉన్నాయి. యువత, మహిళలకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు హామీ లభిస్తుందని జిల్లావాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జనసమీకరణకు ఏర్పాట్లు..

ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో భారీఎత్తున జనసమీకరణపై బీజేపీ దృష్టిపెట్టింది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి పెద్దఎత్తున ప్రజలను తరలించి సత్తాచాటాలని చూస్తోంది. ప్రధానంగా మహిళలు, యువత ఎక్కువ సంఖ్యలో పాల్గొనేలా కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ప్రధాని మోదీ సభ ద్వారా ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో తమ అభ్యర్థుల గెలుపునకు మార్గం సుగమం చేసుకోవాలని, పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపాలని బీజేపీ భావిస్తోంది.



క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్, బైక్ ఢీ: యువకుడి దుర్మరణం


గణేష్ (ఫైల్)

వెల్దండ: ఇసుక ట్రాక్టర్, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన వెల్దండ మండలం పెద్దాపూర్ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కుప్పగండ్ల గ్రామానికి చెందిన ఉప్పు గణేష్ (26) వ్యక్తి గత పని నిమిత్తం బైక్‌పై ఆమనగల్లుకు వెళ్లి వస్తుండగా.. పెద్దాపూర్ సమీపంలో వేగంగా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టింది. ప్రమాదంలో గణేష్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ అక్కడి నుంచి పరారై, పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి మార్చురీకి తరలించారు. ఈవిషయంపై పోలీసులను వివరణ కోరగా, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని.. ప్రమాదంపై పూర్తి విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి..




మక్తల్: ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతి చెందిన ఘటన మక్తల్ మండలం కాచ్‌వార్‌లో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కాచ్‌వార్‌కు చెందిన మోహన్‌గౌడ్ అలియాస్ గున్నయ్యగౌడ్ (45) మక్తల్‌లో ట్రాక్టర్‌కు సర్వీసింగ్ చేసుకొని ఇంటికి వచ్చారు. మళ్లీ ట్రాక్టర్‌ను ట్రయల్ వేద్దామని రోడ్డుసైడ్ వెళ్తూ సడన్ బ్రేక్ పట్టడంతో పల్టీ కొట్టింది. దీంతో అతను ట్రాక్టర్ కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని మక్తల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మోహన్‌గౌడ్ సోదరుడు చంద్రయ్యగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మిరెడ్డి తెలిపారు.

విద్యుత్‌షాక్ గురై ఒకరు మృతి

గద్వాల క్రైం: విద్యుత్ షాక్ గురై ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని ఈడిగోనిపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రాములు (40) బుధవారం రాత్రి గ్రామంలోని ఓ టీ స్టాల్ వద్దకు వెళ్లాడు. అయితే ఉక్కపోతగా ఉండడంతో టీ స్టాల్‌లో ఫ్యాన్ స్విచ్ ఆన్ చేశాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు షాక్‌కు గురై అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి కుటుంబాని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి


వెంకటేష్ (ఫైల్)

ఖిల్లాఘనపురం: చేపలవేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడు ప్రమాదవశాత్తు మృతిచెందిన ఘటన ఖిల్లాఘనపురం మండలం కమాలొద్దీన్‌పూర్‌లో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కమాలొద్దీన్‌పూర్‌కు చెందిన సింగనమోని వెంకటేష్ (33) గురువారం గ్రామ సమీపంలోని నాగసముద్రం చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చెరువులో చేపలు పడుతున్న క్రమంలో వల కాళ్లకు చుట్టుకోవడంతో నీటిలో మునిగిపోయి మృతిచెందాడు. మత్స్యకారుల సహాయంతో మృతదేహాన్ని చెరువులో నుంచి బయటికి తీశారు. మృతుడికి భార్య రమాదేవితో పాటు కుమారుడు, కూతురు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ మార్చురీకి తరలించారు.

బొలెరో వాహనం ఢీకొని బాలుడు మృతి

అలంపూర రూరల్: బొలెరో వాహనం ఢీకొని ఓ బాలుడు మృతిచెందిన ఘటన అలంపూర్ మున్సిపాలిటీలోని ఇమాంపూర్‌లో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఇమాంపూర్‌కు చెందిన రాంబాబు – మౌనికల కుమారుడు మహోదయ (8) ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా.. అలంపూర్‌వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో బాలుడికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ శ్రీనివాసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

పర్యవేక్షణ పట్టదు.. నిర్లక్ష్యం వీడరు


వెంకటాపూర్ పాఠశాలలో ఉపాధ్యాయులు ఆలస్యంగా రావడంతో ప్రార్థన చేయిస్తున్న ఏఎంఓ శ్రీనివాస్, కాంప్లెక్సు హెచ్‌ఎం (ఫైల్)

ప్రభుత్వ పాఠశాలలను వేధిస్తున్న ప్రధాన సమస్యలు

- విధుల నిర్వహణలో తీరు మార్చుకోని ఉపాధ్యాయులు
- మల్దకల్ మండలంలో ఒకరిపై పోక్సో కేసు నమోదు
- విధులకు ఆలస్యంగా వచ్చారని వెంకటాపూర్ పాఠశాల టీచర్‌కు నోటీసులు
- వారం రోజుల క్రితం మహబూబ్‌నగర్ రూరల్‌లో ఒకరి సస్పెండ్
- ఉమ్మడి జిల్లాలో రెగ్యులర్ డీఈఓలు, ఎంఈఓలు లేని ఫలితం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలో రెగ్యులర్ డీఈఓ, ఎంఈఓలు లేకపోవడంతో పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ప్రతిరోజు ఏదో ఒకచోట పాఠశాలల్లో విధుల పట్ల ఉపాధ్యాయుల నిర్లక్ష్యం, విద్యార్థినుల పట్ల అసభ్యకర ప్రవర్తన వంటి అంశాలు వెలుగు చూస్తున్నాయి. ఇలాంటి సంఘటనలు బయటపడినప్పుడు మాత్రమే అధికారులు హడావుడి చేస్తున్నారు. తర్వాత మళ్లీ అవే సంఘటనలు పునరావృతం అవుతున్నాయి. గతంలో ఎంఈఓలకు పాఠశాలలపై పర్యవేక్షణ బాధ్యత ఉండేది కానీ, ప్రభుత్వం గతేడాది నుంచి కాంప్లెక్సు హెచ్‌ఎంలకు అప్పగించడంతో వారు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అన్ని స్థాయిల్లో ఇన్‌చార్జ్‌లే ఉండటంతో తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకునేందుకు వెనకడుగు వేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

విద్యార్థినులపై వేధింపులు

విద్యాబుద్ధులు నేర్పించాల్సిన కొందరు ఉపాధ్యాయులు బాలికలపై వేధింపులకు దిగుతున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని ఓ పాఠశాలలో విద్యార్థిని వేధింపులకు గురిచేస్తున్నట్లు తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదవడమే ఇందుకు నిదర్శనం. ఎఫ్ఐఆర్ ఆధారంగా ఆయన్ను మంగళవారం సస్పెండ్ చేసినట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. అలాగే మూడు నెలలక్రితం నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలంలోని ఓ పాఠశాలలో విద్యార్థినిపై జూనియర్ అసిస్టెంట్ వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో సస్పెండ్ చేశారు. గత విద్యా సంవత్సరంలో మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ, మూసాపేట మండలాల్లో విద్యార్థినులను వేధింపులకు గురిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారు. అధికారులు చర్యలు తీసుకున్నప్పటికీ తరచుగా ఇలాంటి ఘటనలు వెలుగు చూస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.

చర్యలు తీసుకుంటాం



విద్యార్థినుల పట్ల ఇబ్బందికరంగా వ్యవహరించే ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటాం. అలాగే విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై గతంలోనూ చర్యలు తీసుకున్నాం. సమయపాలన, తరగతుల బోధన, మధ్యాహ్న భోజనం వంటి అంశాలపై జాగ్రత్తగా వ్యవహరించాలి.

– గోవిందరాజులు, ఇన్‌చార్జ్ డీఈఓ, నాగర్‌కర్నూల్, వనపర్తి

స్పష్టమైన ఆదేశాలు..



పాఠశాలల్లో విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించే ఉపాధ్యాయులపై పోక్సో కేసులు నమోదు చేస్తాం. ఇందుకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. ఇక విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. పాఠశాలకు ఆలస్యంగా వచ్చిన వెంకటాపూర్ పాఠశాల ఉపాధ్యాయురాలికి నోటీసులు ఇచ్చాం.

– రవీందర్, డీఈఓ, మహబూబ్‌నగర్

ఒక్కొక్కరు ఒక్కో తీరు

పాఠశాలలపై పర్యవేక్షణ లేకపోవడంతో ఉపాధ్యాయులు తమ ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. సమయపాలన లేకపోవడం, తరగతులు బోధించకపోవడం వంటి ఆరోపణలు వస్తున్నాయి. మహబూబ్‌నగర్ రూరల్ మండలం నర్సాపూర్ పాఠశాల ఉపాధ్యాయుడు విధులకు హాజరుకాకుండా ఒక ప్రైవేటు టీచర్‌ను నియమించారు. ఈ విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తేవడంతో విచారణ చేపట్టిన అధికారులు ఆయన్ను వారం రోజుల క్రితం సస్పెండ్ చేశారు. అలాగే మహబూబ్‌నగర్ రూరల్ మండలం వెంకటాపూర్ పాఠశాలలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఉపాధ్యాయురాలికి అధికారులు నోటీసులు ఇచ్చారు. అంతేకాకుండా నాలుగు నెలల క్రితం నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలంలోని ఓ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు బయోమెట్రిక్ యంత్రాన్ని వెంట తీసుకెళ్లి అటెండెన్స్ వేశారు. దీంతో ఫిర్యాదులు రావడంతో ఆయన్ను అధికారులు సస్పెండ్ చేశారు. గత విద్యా సంవత్సరంలో హన్వాడ మండలం టంకర పాఠశాలలో మధ్యాహ్న భోజనం పెట్టడం లేదన్న ఆరోపణలపై ముగ్గురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేసిన అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి.. మూడు రోజులకే వారిని విధుల్లోకి తీసుకున్నారు.

ఇన్‌చార్జ్‌లే దిక్కు..

పాఠశాలలో పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేసేందుకు ఉమ్మడి ఐదు జిల్లాల్లో ఒక్కచోట కూడా రెగ్యులర్ డీఈఓ లేరు. గోవిందరాజులు నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలు, రవీందర్ మహబూబ్‌నగర్, అబ్దుల్ ఘని నారాయణపేట జిల్లాకు ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తుండగా.. గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ డీఈఓ సిరాజ్ సెలవులో వెళ్లారు. ఇక ఉమ్మడి జిల్లాలో పాతవాటి ఆధారంగా మొత్తం 64 మండలాలు ఉండగా ఇందులో 10మంది మాత్రమే రెగ్యులర్ ఎంఈఓలుగా ఉన్నారు. మిగతా అన్నిచోట్ల కొంతమంది వివిధ పాఠశాలల హెచ్‌ఎంలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఇలా ఒక్కొక్కరికి 3, 4 మండలాల బాధ్యతలు అప్పగించడంతో ఎప్పుడు.. ఎక్కడ ఉంటారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. వెంటనే రెగ్యులర్ డీఈఓలు, ఎంఈఓ పోస్టులు భర్తీ చేయాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

గురుకుల విద్యార్థుల మధ్య ఘర్షణ


ఇంటర్, పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌సీఓ ఫ్లోరెన్స్‌రాణి

జడ్చర్ల టౌన్: మండలంలోని పోచమ్మగడ్డతండా వద్ద ఉన్న బాలానగర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో ఆదిపత్య పోరు కారణంగా విద్యార్థుల మధ్య జరిగింది. ఈ క్రమంలో పదో తరగతి విద్యార్థులను ఇంటర్ విద్యార్థులు చితకబాదిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకోగా.. గురువారం ఆర్‌సీఓ ఫ్లోరెన్స్‌రాణి పాఠశాలను సందర్శించి విద్యార్థుల మధ్య రాజీ కుదిర్చారు. ఘటనకు సంబంధించిన వివరాలిలా.. పాఠశాలలో కొంతకాలంగా ఇంటర్, పదో తరగతి విద్యార్థుల మధ్య ఆదిపత్య పోరు కొనసాగుతుంది. అందులో భాగంగానే బుధవారం రాత్రి 10.25 గంటల ప్రాంతంలో ఇంటర్ విద్యార్థి ఒకరు పదో తరగతి విద్యార్థిని చితకబాదాడు. ఈ క్రమంలో అడ్డుకోబోయిన మరో ఐదుమంది విద్యార్థులు సైతం గాయాలబారిన పడ్డారు. ఘర్షణ జరుగుతున్న క్రమంలో అక్కడికి ఉపాధ్యాయులు చేరుకుని విద్యార్థులకు నచ్చజెప్పారు. అదే సమయంలో పాఠశాలలోనే ఉన్న ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు సైతం విద్యార్థులకు నచ్చచెప్పి సముదాయించారు. ఘటనకు సంబంధించి గురువారం ఉదయం పదో తరగతి విద్యార్థులు ఇంటర్ విద్యార్థుల వద్దకు వెళ్లి ఎందుకు తమను కొట్టారని ప్రశ్నించారు. ఈ క్రమంలో మరోసారి వారి మధ్య తోపులాట చోటుచేసుకుంది. అప్పటికే అక్కడికి చేరుకున్న విద్యార్థి సంఘాలు, కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు జోక్యం చేసుకుని సముదాయించారు. ఆర్‌సీఓ ఫ్లోరెన్స్‌రాణి సైతం పాఠశాలకు చేరుకుని విద్యార్థుల మధ్య రాజీ కుదిర్చారు. కొట్టిన విద్యార్థులు తమది తప్పయ్యిందని పదో తరగతి విద్యార్థులకు క్షమాపణ చెప్పి కలిసిపోయారు. ఘటనలో పోలీసులు సైతం విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఘర్షణకు సంబంధించి కేసులు నమోదైతే భవిష్యత్ పాడవుతుందని మరోమారు ఇలాంటి ఘటనలకు పాల్పడొద్దంటూ సూచించారు. ఘటనపై ఆర్‌సీఓ ఫ్లోరెన్స్‌రాణి, ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు మాట్లాడుతూ విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణ చిన్నది అని వివరించారు. ఇంటర్ పరీక్షలు ముగియడంతో గొడవకు కారణమైన విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోయారు.

గనుల శాఖలో అధికారుల బదిలీలు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గనులు, భూగర్భ శాఖలో పనిచేస్తున్న అధికారులను బదిలీ చేస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మహబూబ్‌నగర్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా డిప్యుటేషన్‌పై రంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న ప్రవీణ్‌ను మెదక్ జిల్లాకు, వరంగల్ రూరల్ జిల్లాలో పనిచేస్తున్న రవీందర్ నాగర్‌కర్నూల్‌కు బదిలీపై వచ్చారు. ఖమ్మం జిల్లాలో పనిచేస్తున్న సంజయ్‌కుమార్‌ను మహబూబ్‌నగర్ ఏడీగా, గనులు, భూగర్భ శాఖ హెడ్ ఆఫీస్‌లో పనిచేస్తున్న గోవిందరాజును వనపర్తి ఏడీగా, వనపర్తి ఏడీ శ్రీనివాస్‌ను పెద్దపల్లి ఏడీగా, నాగర్‌కర్నూల్‌లో పనిచేస్తున్న సాంబశివరావును హనుమకొండ ఏడీగా బదిలీ చేశారు. అలాగే మహబూబ్‌నగర్‌లో అసిస్టెంట్ జియాలజిస్టుగా పనిచేస్తున్న భరణిని పెద్దపల్లికి, నారాయణపేటలో పనిచేస్తున్న నగేష్‌ను కామారెడ్డి జిల్లాకు, సూర్యాపేటలో పనిచేస్తున్న వెంకటరమణను గద్వాల జిల్లాకు, గద్వాలలో పనిచేస్తున్న విజయరామరాజును సూర్యాపేటకు, మహబూబ్‌నగర్‌లో పనిచేస్తున్న విజయ్‌కుమార్‌ను జనగామ జిల్లాకు బదిలీ చేశారు. అలాగే నాగర్‌కర్నూల్‌లో ఆర్ఐగా పనిచేస్తున్న వెంకటగిరిని పెద్దపల్లి జిల్లాకు, రంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న సత్యనారాయణను గద్వాలకు, హనుమకొండలో పనిచేస్తున్న సురేఖను వనపర్తికి, గద్వాల జిల్లాలో పనిచేస్తున్న వసుమతిని సూర్యాపేటకు, హెడ్ ఆఫీస్‌లో పనిచేస్తున్న నాగచైతన్యను నాగర్‌కర్నూల్ జిల్లాకు, పెద్దపల్లి జిల్లాలో పనిచేస్తున్న సైదులును మహబూబ్‌నగర్ జిల్లా రాయల్టీ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

హామీల అమలులో విఫలం


కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

అచ్చంపేట రూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్ అన్నారు. గురువారం అచ్చంపేటలో గిరిజన సంఘం ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన జనాభా నిష్పత్తి ప్రకారం కేంద్ర బడ్జెట్‌లో కేటాయించిన నిధులను ఖర్చు చేయకుండా దారి మళ్లించారని ఆరోపించారు. దేశంలో 7 శాతం ఉన్న గిరిజనులకు రిజర్వేషన్లు 12 శాతానికి పెంచకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. బయ్యారంలో గిరిజన యువతకు ఉపాధి కల్పించే ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయకుండా చేతులెత్తేశారని విమర్శించారు. గిరిజన యూనివర్సిటీలో 80 శాతం రిజర్వేషన్ కల్పించాల్సి ఉండగా.. కేవలం ఏడు శాతం కల్పించి అన్యాయం చేశారన్నారు. ఈనెల 20న తానునాయక్ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గిరిజనుల హక్కుల గర్జన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు దేశ్యానాయక్, ప్రధానకార్యదర్శి శంకర్ నాయక్, శ్రీను, రాజేష్, పవన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

కమీషన్ల పేరిట టోకరా

- పెట్టుబడి డబ్బుతో ఉడాయించిన తన్విత కంపెనీ
- సుమారు రూ. 16కోట్ల వరకు వసూలు
- అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

అచ్చంపేట రూరల్: తమ సంస్థలో పెట్టుబడులు పెడితే లాభాలు వస్తాయని ఓ సంస్థ రూ.కోట్లు వసూలు చేసి మోసానికి పాల్పడింది. బాధితుల వివరాల మేరకు.. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌కు చెందిన తన్విత ఆయుర్వేద నిలయం ఎండీ కోన నర్సిరెడ్డి, అతడి భార్య నిత్యలు ఆయుర్వేద ఉత్పత్తుల ఫ్యాక్టరీ డెవలప్‌మెంట్ సంస్థ పేరుతో అచ్చంపేటలో పరిచయాలు పెంచుకున్నారు. రూ.లక్ష పెట్టుబడి పెడితే, వారానికి రూ. 5వేల చొప్పున 40 వారాలలో మొత్తం రూ.2 లక్షలు ఇస్తామని నమ్మించారు. ఎవరైనా రూ. 10 లక్షలు పెట్టుబడి పెడితే, ఓపెన్ ప్లాట్ సెక్యూరిటీతో అసలు, వడ్డీ చెల్లిస్తామని, తమది గ్రూప్ ఆఫ్ కంపెనీ అని, ఇతర ప్రాంతాల్లో కూడా ఇండస్ట్రీస్ ఉన్నాయని నమ్మబలికారు. అందులో భాగంగా పట్టణానికి చెందిన మందుల కార్తీక్, అతడి స్నేహితులు, బంధువుల వద్ద పెట్టుబడులు తీసుకున్నారు. సుమారు రూ. 16 కోట్లు వసూలుచేసినట్లు బాధితులు తెలిపారు. మాయమాటలు చెప్పి మోసం చేసిన కోన నర్సిరెడ్డి, అతడి భార్య నిత్య, తన్విత ఆయుర్వేదిక్ నిలయం డైరెక్టర్స్ అద్దాళ్ల రమేష్ కుమార్, శేఖర్, దేవికారాణిపై చర్యలు తీసుకుని, న్యాయం చేయాలని గురువారం అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మందుల కార్తీక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాము తెలిపారు.

బతుకుదెరువు కోసం వెళ్లి మృత్యువాత

గోపాల్‌పేట: బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లిన యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో ఏదుట్లకు చెందిన లొడుగు మల్లేష్, లొడుగు కాశమ్మలకు ఇద్దరు కుమారులు ఉన్నారు. మల్లేష్ 15ఏళ్ల క్రితం మృతి చెందగా, బతుకుదెరువుకోసం కాశమ్మకు ఇద్దరు కుమారులతో హైదరాబాద్ వెళ్లారు. పెద్దకుమారుడు లొడుగు కురుమూర్తి (18) నగరంలోని ఓ మెస్‌లో పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం హఠాత్తుగా పనిచేస్తున్న దగ్గరే కిందపడిపోయాడు. సిబ్బంది గమనించి పక్కనే ఉన్న ఆస్పత్రిలో చేర్పించారు. మూడు రోజులుగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. కుటుంబానికి అండగా ఉన్న కుమారుడు మృతి చెందడంతో కాశమ్మ రోదన మిన్నంటింది.

అత్తారింటికి వచ్చిన అల్లుడు అదృశ్యం

- కుమారుడిని హతమార్చారని తల్లిదండ్రుల ఫిర్యాదు
- విచారణ చేపట్టిన పోలీసులు

చిన్నచింతకుంట: అత్తారింటికి వచ్చిన అల్లుడు అదృశ్యమైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మూసాపేట మండలం వేములకు చెందిన గొల్ల సాయన్న (38)కు మండలంలోని కురుమూర్తికి చెందిన శివమ్మతో 13ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. భార్యాభర్తలు ఇద్దరు తరుచూ గొడవపడుతుండగా, నెల రోజుల నుంచి భార్య శివమ్మ పుట్టినిల్లయిన కురుమూర్తికి వచ్చి ఉంటుంది. దీంతో ఆదివారం భర్త ఆమెను తీసుకెళ్లేందుకు గ్రామానికి వచ్చాడు. కాగా ఆయన తిరిగి ఇంటికి రాకపోవడంతో సాయన్న తల్లిదండ్రులు ఆందోళన చెందారు. దీంతో ఆయన ఆచూకీ కోసం వెతికినా లాభం లేకపోయింది. దీంతో గురువారం వారు చిన్నచింతకుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమ కుమారుడిని అత్తారింటి వారే హతమార్చారని ఆరోపించారు. దీనిపై పోలీసులు గ్రామంలో విచారణ చేపట్టారు. సాయన్నను అత్తింటి వారే హతమార్చి పూడ్చి పెట్టారంటూ గ్రామంలో చర్చనీయాంశమైంది.

ఎత్తుకెళ్లిన వాహనం స్వాధీనం

గద్వాల క్రైం: ఇటీవల విద్యుత్‌శాఖ కార్యాలయంలో నిలిపిన వాహనాన్ని ఎత్తుకెళ్లగా, గురువారం పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 11వ తేదీన విద్యుత్‌శాఖ సిబ్బంది బొలెరో వాహనంలో సైట్ పనులు ముగించుకుని సాయంత్రం కార్యాలయంలో నిలిపి వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు 12వ తేదీన వాహనాన్ని అపహరించారు. సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని సాంకేతిక పరిజ్ఞానం, సీసీ కెమెరాల సాయంతో ఆరా తీయగా జిల్లా కేంద్రం మీదుగా జడ్చర్ల, షాద్‌నగర్, హైదరాబాద్ నుంచి నాగపూర్ రోడ్డు మార్గంలో వెళ్తున్నట్లు సమాచారం అందిందన్నారు. నిర్మల్ జిల్లా ఇందల్‌వాయి టోల్‌ప్లాజా వద్ద నిర్మల్ పోలీసుల సాయంతో వాహనాన్ని గుర్తించగా నిందితుడు తేరుకుని తప్పించుకునేందుకు ప్రయత్నం చేశాడన్నారు. అప్పటికే పోలీసులు మోహరించడంతో దగ్గరలోనే పెట్రోల్‌బంకు వద్ద వాహనం నిలిపి నిందితుడు తప్పించుకున్నడన్నారు. గురువారం గద్వాల పోలీసులు బొలెరో వాహనం, రూ.50వేల విలువ గల సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. త్వరలో నిందితుడుని సైతం అదుపులోకి తీసుకుంటామన్నారు.

బైక్‌లో పెట్టిన రూ.5లక్షలు చోరీ

అలంపూర్ రూరల్: బ్యాంకు నుంచి డబ్బులు డ్రా చేసి బైక్‌లో ఉంచగా, గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన ఘటన అలంపూర్‌లో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గాంధీచౌక్ సమీపంలో గురువారం గొందిమళ్లకు చెందిన వెంకటేశ్వర్లు మినుములు అమ్మగా వచ్చిన డబ్బులు రూ.5లక్షలు బ్యాంకు నుంచి డ్రా చేశారు. వాటిని బయటకు తెచ్చి తన బైక్‌లో ఉంచి పక్కనే ఉన్న కూరగాయల దుకాణానికి వెళ్లారు. ఆయన తిరిగి వచ్చే లోపు బైక్‌లో ఉన్న నగదు కనిపించలేదు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మిడ్జిల్: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన గురువారం మండలంలోని మసిగొండ్లపల్లిలో చోటుచేసుకుది. ఎస్‌ఐ ఆనంద్ వివరాల ప్రకారం.. మసిగొండ్లపల్లికి చెందిన రమేష్(18) ఈ నెల11న అనారోగ్య సమస్య వల్ల పురుగు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. అతని తండ్రి చెన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జీవితంపై విరక్తితో బలవన్మరణం


గొల్ల అశోక్(ఫైల్)

మద్దూరు: జీవితంపై విరక్తితో చెట్టుకు ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం మండలంలోని చెన్వార్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాంలాల్ కథనం మేరకు.. చెన్వార్‌కు చెందిన గొల్ల అశోక్(32) ఇంటి నిర్మాణంలో టైల్స్, బండలు వేసే మేస్త్రీ పని చేసేవాడు. కొంతకాలంగా సరైన పనులు లేకపోవడం, కుటుంబం గడువకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. గురువారం ఉదయం పశువుల పేడ తీసి, మేత వేస్తానని ఇంట్లో భార్య గొల్ల ఆశమ్మకు చెప్పి పొలానికి వెళ్లాడు. పశువులను కట్టేసే తాడుతో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం 7గంటల సమయంలో ఆయన అన్న గొల్ల భీమప్ప పొలం దగ్గరకు వెళ్లి చెట్టుకు వేలాడుతున్న తమ్ముణ్ని చూసి వెంటనే మరదలుకు ఫోన్ చేశారు. అప్పటికే అశోక్ మృతి చెంది ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆశమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాంలాల్ తెలిపారు. అతనికి ఇద్దరు కుమారులున్నారు.

చీరతో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

అలంపూర్ రూరల్: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇమాంపురం చెందిన షఫి (22) తల్లిదండ్రులు మృతి చెందగా, ఈయనకు ఇద్దరు అన్నలు ఉన్నారు. కాగా షఫి కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. గురువారం ఏమైందో తెలియదు కానీ రాత్రి 8గంటలో చీరతో ఇంట్లో ఉన్న కొండికి ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యులు గమనించి ఆయనను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడు. ఘటనపై విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రిప్టో కరెన్సీపై వర్క్‌షాప్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు, అధ్యాపకులు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో క్రిప్టో కరెన్సీపై గురువారం ఒకరోజు రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. హైదరాబాద్ ఐసీఎఫ్ఏఐ అసిస్టెంట్ ప్రొఫెసర్ నరేందర్ మిరియాల, నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా అసిస్టెంట్ ప్రొ.సాయికిరణ్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహాలను నివృతి చేశారు. క్రిప్టోకరెన్సి డిజిటల్ కరెన్సిగా చెబుతూ ఇన్నాళ్లు ఆర్‌బీఐ దాన్ని నిషేధించిందని, ఇటీవలే సుప్రీంకోర్టు నిషేదాన్ని ఎత్తివేసిందని వివరించారు. దీనిపై ఎవరి నియంత్రణ ఉండదని, డీసెంట్రలైజ్ పద్ధతిలో పనిచేస్తుందన్నారు. వర్క్‌షాప్‌లో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అకాడమిక్ కో ఆర్డినేటర్ రవీందర్‌రావు, కామర్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ మంజుల పాల్గొన్నారు.

దళిత క్రిస్టియన్లపై దాడులు హేయమైన చర్య

మహబూబ్‌నగర్ రూరల్: మతోన్మాదులు చర్చిలపై, క్రిస్టియన్లపై దాడులకు పాల్పడటం హేయమైన చర్య అని దళిత క్రిస్టియన్ దండోర జాతీయ అధ్యక్షుడు ప్రొ.గాలి వినోద్‌కుమార్ అన్నారు. దళిత క్రైస్తవ దండోరా ఆధ్వర్యంలో గురువారం స్థానిక అంబేద్కర్ కళాభవన్‌లో నిర్వహించిన దళిత క్రైస్తవ గర్జనకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుదూ చర్చిలపై, క్రిస్టియన్లపై దాడులు చేయకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. దళిత క్రిస్టియన్లంతా ఏకమై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లా కన్వీనర్ మామిడి సామేల్ మాట్లాడుతూ మనువాదుల దాడులను తిప్పికొట్టి రాజ్యాంగ విలువలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో కాశీ సతీష్ కుమార్, బాలరాజు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

అఖిల రియల్ ఎస్టేట్స్ వారి అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న అలంపూర్ చౌరస్తా, ఎంఎల్‌ఏ క్యాంప్ ఆఫీస్‌కు అతి చేరువలో ఆర్.కె.నగర్-2 వెంచర్‌లో అతి తక్కువ ధరకే ప్లాట్లు కలవు. మరియు కర్నూలు పుల్లూరు టోల్ ప్లాజా ఆనుకొని KUDA అప్రూవల్ గల హైవే టౌన్‌షిప్ వెంచర్ నందు ప్లాట్లు కలవు. సెంటు 5 లక్షలు మాత్రమే. సం.ప్ర: 78933 77713, 80008 72379.

BUSINESS OFFER

మీ బంగారం తాకట్టులో ఉందా. వడ్డీ చెల్లించలేకపోతున్నారా. ఎటువంటి ఫైనాన్స్‌లో ఉన్నా బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకే కొనబడును. ఫోన్: 9550806222.

WANTED

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం జీతం: 18k. ఫోన్: 9160900024 / 9640400073.

Milk Packing Operator Sids Farm Attractive Salary Package @ Shabad, TS. Ph: 8309080683 / 9346621357, Email: hr@sidsfarm.com

గమనిక

[illegible] – సాక్షి మేనేజర్

క్లుప్తంగా

కార్మికులకు వైద్య పరీక్షలు



బాలానగర్: మండల కేంద్రంలో సంతబజారులో గురువారం లేబర్ కార్డు కలిగిన భవన నిర్మాణ కార్మికులకు గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సీఎస్‌సీ డివిజన్ మేనేజర్ వెంకటేశ్వర్లు, జిల్లా కోర్డినేటర్ నరేష్ ఆధ్వర్యంలో లేబర్ కార్డు కలిగిన వందకు పైగా కార్మికులకు రక్తపోటు, షుగర్, వినికిడి, కంటి, ఊపిరితిత్తుల, మూత్రపిండాల పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్యాంపు బృందం మనోజ్ఞ, అత్రనాజ్, శ్రీనివాస్, పృథ్వీరాజ్, కలీమ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్యశిబిరం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని సత్యనారాయణ స్వామి దేవాలయంలో శుక్రవారం ఉచిత ఆక్యుపంక్చర్, న్యాచురోపతి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు ఈశ్వర్ తెలియజేశారు. పది మంది హీలర్లు నాడిపట్టుకుని వ్యాధిని నిర్ధారించి చికిత్స అందిస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆదివాసీ కాంగ్రెస్ కోఆర్డినేటర్‌గా లింగంనాయక్



స్టేషన్ మహబూబ్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏఐసీసీ ఆదివాసీ కాంగ్రెస్ విభాగం పార్లమెంట్ నియోజకవర్గాలకు కోఆర్డినేటర్లను నియమాకం చేసింది. మహబూబ్‌నగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్‌గా జిల్లా ఎస్టీసెల్ చైర్మన్ లింగంనాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ ఆదివాసీ విభాగం రాష్ట్ర చైర్మన్ బెల్లయ్య నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. లింగం నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్లమెంట్ కోఆర్డినేటర్‌గా నియమించినందుకు ఏఐసీసీ, టీపీసీసీ ఆదివాసీ విభాగం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

17న రాయగూడని పద్యం పుస్తకావిష్కరణ

జడ్చర్ల టౌన్: పశ్చిమబెంగాల్ ప్రాంతానికి చెందిన ప్రముఖ కవయిత్రి మౌమితా ఆలం రాసిన కవితలను అనువాదం చేసిన రాయగూడని పద్యం పుస్తకావిష్కరణ ఆదివారం నిర్వహిస్తున్నట్లు కవి పాలమూరు అధ్యయన వేదిక సభ్యుడు ఉదయమిత్ర (యాదగిరి) తెలిపారు. ఆమె కవితలు హిందీ, తమిళ్, మళయాళం, ఒరియా, పంజాబి భాషల్లోకి అనువాదం అయ్యాయని తెలుగులో చాలా తక్కువగా వచ్చాయన్నారు. మిగిలిన అన్ని కవితలను తాను అనువాదం చేసినట్లు చెప్పారు. రాయగూడని పద్యం పేరుతో తాను అనువాదం చేసిన పుస్తకాన్ని ఆదివారం పీఓడబ్ల్యూ సంధ్య అధ్యక్షతన హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన్ భవన్‌లో జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ప్రజాస్వామిక వాదులు అందరూ హాజరుకావాలని కోరారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

భూత్పూర్: మండలంలోని తాటికొండ ఉన్నత పాఠశాల, పట్టణంలోని జ్యోతిరావుపూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. వెంకట్రాములు, ఎస్ఓ బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



మిడ్జిల్: మండలంలోని మల్లాపూర్ చెందిన శేఖర్ గురువారం తెల్లవారుజామున ఆటోలో 18 సంచులు (9.50 క్వింటాళ్ల) రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండడంతో ఆటోను పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ ఆనంద్ తెలిపారు. పట్టుబడిన బియ్యాన్ని రెవెన్యూ శాఖకు అప్పగించగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వెంకటేశ్వర్‌రెడ్డి విచారించినట్లు తెలిపారు. అక్రమంగా బియ్యం రవాణా చేస్తున్న శేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుల వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా గోపాల్‌పేటకు చెందిన ఫిరోజ్ అడ్డాకులలోని తమ మేనమామ ఇంటి వద్దే ఉంటున్నాడు. స్కూటీపై అడ్డాకుల నుంచి మహబూనగర్ వెళ్తుండగా వేముల స్టేజి వద్ద హనుమాన్ దాబా దాటిన తర్వాత ముందు వెళ్తున్న వాహనం సడన్ బ్రేక్ వేసింది. దాని వెనకాలే ఉన్న ఫిరోజ్ స్కూటీతో ఢీకొట్టుకోవడంతో తలకు బలమైన గాయాలై తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు బాధితుడిని అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ సుజాత తెలిపారు.

పూర్తికాని డబుల్ రోడ్డు పనులు

- 2021లో 11కి.మీలకు నిధులు మంజూరు
- పెండింగ్‌లోనే ఉడిత్యాల బీటీ రోడ్డు, బ్రిడ్జి పనులు



ఏకలవ్య గురుకులం వద్ద అసంపూర్తిగా ఉన్న డబుల్ రోడ్డు

బాలానగర్: పారిశ్రామికంగా, పదుల సంఖ్యలోని గ్రామాలను కలుపుతూ నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉండే ఉడిత్యాల సింగిల్ రోడ్డును రెండు వరసల బీటీగా మార్చేందుకు పనులు ప్రారంభించారు. మండలంలోని పెద్దయాపల్లి ముఖ్యకూడలి జాతీయరహదారి–44 నుంచి గుండేడ్, ఈదమ్మగడ్డతండా, ఉడిత్యాల మీదుగా మండలంలోని వీరన్నపల్లి మీదుగా, వీరన్నపల్లి తండా వరకు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం ద్వారా సుమారు రూ.10.62 కోట్ల వ్యయంతో 11 కిలోమీటర్ల మేర బీటీని రెండు వరసలుగా మార్చేందుకు చేపట్టిన కార్యక్రమం నత్తనడకన సాగింది. 2021 జూన్‌లో ప్రారంభమైన పనులు నత్తనడకన సాగుతూ నేటికీ పూర్తి కాలేదు. పెద్దాయపల్లి రెవెన్యూ పరిధిలోని ఏకలవ్య గురుకులం వద్ద భారీ పైపులతో బ్రిడ్జి నిర్మాణం, ముద్దాయి చెరువు వద్ద వంతెన, ఉడిత్యాల సీసీ రోడ్డు నిర్మాణంతో రెండు వరసల పనులు చేయాల్సి ఉంది. అయితే వర్షాలతో భారీ వాహనాలు దిగబడతాయని వాహనాల రాకపోలకు ప్రత్యమ్నయ మార్గం లేదని చెబుతూ ఏకలవ్య గురుకులం, ముద్దాయిచెరువు వద్ద బ్రిడ్జి నిర్మాణం, ఉడిత్యాలలో రెండు వరుసుల సీసీరోడ్డు వేయకుండానే వదిలేశారు. ఈ విషయాలపై గతంలో బీటీ పూర్తి కాలేదని తీవ్ర దుమ్ము రేగుతుందని పలుమార్లు 'సాక్షి' దినపత్రికలో కథనాలు రావడంతో కంకరపై ఒకలేన్ బీటీ వేసి వదిలేసారు. బీటీ పడి రెండు సంవత్సరాలు గడిచినా నిధుల కొరతకారణంగా పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది.

రోడ్డును పూర్తి చేయాలి..



నిత్యం బాలానగర్‌కు బైక్‌పై వస్తూపోతూ ఉంటాను. రెండు వరుసల బీటీ రోడ్డు పూర్తి కాకపోవడంతో, ఈ రోడ్డు గుండా వచ్చిన పలువురు నా కళ్ల ముందే ప్రమాదాల బారిన పడ్డారు. ఎక్కడా కూడా సూచిక బోర్డులు లేవు. ఇప్పటికైనా బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి బీటీరోడ్డును సైతం అందుబాటులోకి తీసుకురావాలి.

– మేగావత్ రాజు, గుడిబండ తండా

నిధుల కొరత

పెద్దాయపల్లి ముఖ్య కూడలి నుంచి వీరన్నపల్లి వరకు రెండు వరసల బీటీ రోడ్డు భాగంగా ఇప్పటికే ఒక వరుస బీటీ పూర్తి చేశాం. మిగతా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టరుకు నోటీస్ కూడా ఇచ్చాం. చేసిన పనులకు బిల్లులు రాలేదని, కొంతైనా బిల్లు మంజూరైతేనే పనులు తిరిగి ప్రారంభించి పూర్తి చేస్తానని అంటున్నారు.

– వెంకటేశ్వర్‌రెడ్డి, ఏడీఈ

8వేల ఎకరాలకు సాగునీరు



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: మన్య నీర్ల కుంట రిజర్వాయర్ నిర్మాణంతో 15 గ్రామాల పరిధిలో 8వేల ఎకరాలకు సాగు నీరిందించే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని హజిలాపూర్ సమీపంలోని మన్య నీర్లకుంటను ఎమ్మెల్యేతో పాటు నీటి పారుదల శాఖ అధికారులు, రైతులు సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రిజర్వాయర్ నిర్మించే ప్రాంతాన్ని పరిశీలించారు. రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించిన వివరాలను, ఆయకట్టు కింద వచ్చే గ్రామాలపై అధికారులతో చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. చౌదర్‌పల్లి చెరువు నుంచి నీటిని గ్రావిటీ ద్వారా రిజర్వాయర్‌కు మళ్లించి అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా 4 మండలాలలోని 15 గ్రామాలకు సాగునీటిని అందించవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో హజిలాపూర్, లక్ష్మీపల్లి, బస్వాయపల్లి, గోపన్‌పల్లి, కౌకుంట్ల, ఇద్రంపల్లి, రేకులంపల్లి, చక్రాపూర్, దాసర్‌పల్లి, వేముల, తుంకినీపూర్, కొమ్మిరెడ్డిపల్లి, నందిపేట్, పొన్నకల్, రాచాల గ్రామాలకు సాగునీరు అందుతుందన్నారు. అతి తక్కువ ఖర్చుతో 0.8 టీఎంసీల సామార్థ్యంతో 8 వేల ఎకరాలకు ఆయకట్టు సాగులోకి వస్తుందని తెలిపారు. రిజర్వాయర్‌కు సంబంధించిన ప్రతిపాదనలను ఇరిగేషన్ శాఖ అధికారులతో తీసుకుని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రితో చర్చించి రిజర్వాయర్ నిర్మించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే రైతులకు, ఆయా గ్రామాల ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఈ ప్రతాప్‌సింగ్, డీఈ చందు, నాయకులు అంజల్‌రెడ్డి, నాగిరెడ్డి, హన్మంతరెడ్డి, జగదీశ్వర్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పట్టణంలో ఇఫ్తార్

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ రోడ్డులోగల సుదర్శన్ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం సాయంత్రం రంజాన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకుని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో యునైటెడ్ ముస్లిం మైనార్టీ ఫోరం ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తారు విందు ఏర్పాటు చేసినట్లు డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు అజ్మత్‌అలీ గురువారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. విందులో పట్టణంలో ముస్లిం యువకులు, మతపెద్దలు, అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని వారు కోరారు.

బాధితులకు పరామర్శ

అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు శివరాములు కుమారుడు అనారోగ్యానికి గురై జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాలుడిని గురువారం ఆస్పత్రిలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులతో వాకబు చేసి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. మండలంలోని శాఖాపూర్ చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు గోవుల బాలరాజు తండ్రి సత్యన్న ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పరామర్శించారు. సత్యన్న చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. బాలరాజును ఓదార్చి సంతాపం వ్యక్తం చేశారు. అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతున్న సురేందర్‌గౌడ్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిన్నచింతకుంట: పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కుర్వాన్(36) మద్యానికి బానిసై భార్యతో తరుచుగా గొడవ పడేవాడు. భార్య పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టింది. దీంతో మనస్తాపం చెంది బుధవారం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతన్ని మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం



కోయిల్‌కొండ: మండలంలోని గార్లపహాడ్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోట్ల మదన్‌మోహన్‌రెడ్డికి ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా పార్టీలకు చెందిన నాయకులు, ఉపాధ్యాయ బృందం, పీఆర్‌టీయూ నాయకులు శాలువాలతో సత్కరించారు.

మండల అధ్యక్షుల నియామకం

పాలమూరు: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ కొత్తగా మండల అధ్యక్షులను నియామకం చేసింది. అడ్డాకుల మండల అధ్యక్షుడిగా ఈర్ల చిన్న బుచ్చన్న, దేవరకద్ర మండల అధ్యక్షుడిగా కృష్ణంరాజు, కౌకుంట్ల మండల అధ్యక్షుడిగా రవీందర్‌రెడ్డి నియామిస్తూ గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి నియామక పత్రాలు అందించారు. అదేవిధంగా జిల్లాకేంద్రంలోని అప్పన్నపల్లిలోని అభయాంజనేయ స్వామిని గురువారం డీకే అరుణ దర్శించుకున్నారు. పార్టీ జాతీయ నాయకత్వం ఎంపీ టిక్కెట్ కేటాయించిన సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యార్థికి అభినందన

దేవరకద్ర: పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న మనోజ్ఞ ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో నిర్వహించిన కవితల పోటీలలో ప్రథమ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో విద్యార్థిని అభినందించి, నగదు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగేంద్రమ్మ, పులి జమున తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

నారాయణపేట: చట్టం దృష్టిలో అందరూ సమానమేనని రాజ్యాంగం ప్రజలకు సమాన హక్కులు కల్పిస్తుందని జిల్లా అసిస్టెంట్ పీపీ సురేష్ అన్నారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం శీలాగార్డెన్ ఫంక్షన్ హాల్లో మహిళలు, పిల్లలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ మేరకు.. జిల్లా చీఫ్ లీగల్ అండ్‌సెషన్ కౌన్సిల్ అడ్వకేట్ లక్ష్మీపతిగౌడ్ మాట్లాడుతూ.. రాజ్యాంగం హక్కులు ప్రజలకు తెలియజేయాలని, ప్రతి ఒక్కరికీ ఉచితంగా న్యాయం పొందాలన్నారు. ఈ సదస్సులో పీఎల్‌వీ హజమ్మ తదితరులు పాల్గొన్నారు.

వెల్డింగ్ చేస్తుండగా ఖాళీ ట్యాంకర్‌లో పేలుడు



పేలిన ఖాళీ ఆయిల్ ట్యాంకర్

భూత్పూర్: మహబూబ్‌నగర్ జిల్లాలోని భూత్పూర్ మండల కేంద్రం సమీపంలో గురువారం ఓ వెల్డింగ్ దుకాణం వద్ద ఖాళీ ఆయిల్ ట్యాంకర్‌కు వెల్డింగ్ చేస్తుండగా ఆకస్మాత్తు మంటల వచ్చి ట్యాంకర్ పేలిపోయింది. స్థానికుల కథనంమేరకు.. ఆయిల్ ట్యాంకర్ వెనకాల ఉన్న కమాన్ పట్టీల వద్ద వెల్డింగ్ చేస్తుండగా ఒక్క సారిగా పెద్ద శబ్దం వచ్చి ట్యాంకర్ పేలింది. ట్యాంకర్ వద్ద డ్రైవర్ నారాయణ, వెల్డింగ్ దుకాణం పక్కనే టైర్ పంచర్ దుకాణంలో పనిచేసే అజ్వల్‌కు గాయాలు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై ఎస్ఐ శ్రీనివాసులు వివరణ కోరగా ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



బోయపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

మహబూబ్‌నగర్ రూరల్: మహబూబ్‌నగర్ అర్బన్ మండలం బోయపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వపరిపాలన కార్యక్రమం నిర్వహించారు. ఒకరోజు ఉపాధ్యాయులైన విద్యార్థులు తోటి విద్యార్థులకు విద్యాబోధన చేసి పాఠశాల ఉపాధ్యాయుల ప్రశంసలు పొందారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం కవిత, హెచ్‌ఎం తిరుమలయ్య, రాజవర్ధన్, స్వామి, సత్యవతి, అనిత, జలజ, జ్యోతి, సీఆర్పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోల్కంపల్లిలో..

అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మన్నెం, ఉపాధ్యాయులు పుష్పలత, రాఘవేంద్ర తదితరులు ఉన్నారు.



పోల్కంపల్లిలో..



రుద్రారం పాఠశాలలో..

నవాబుపేట: మండలంలోని ఇప్పటూర్, రుద్రారం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు నర్సింహులు, శాంత వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా కాంగ్రెస్



మంత్రి జూపల్లి, ఎమ్మెల్యేల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం హన్వాడ మండలం వేపూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులకు మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మీకు భరోసా ఇస్తుందని, రాబోయే రోజుల్లో మంచి అవకాశాలు కల్పిస్తుందన్నారు. పార్టీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి, ఎన్పీ వెంకటేష్, సీజే బెనహర్, సిరాజ్‌ఖాద్రీ, మహేందర్, యాదవరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట మండలం దాసర్‌పల్లిలో..

చిన్నచింతకుంట: మండలంలోని దాసర్‌పల్లికి చెందిన వివిధ పార్టీల నాయకులు గురువారం దమగ్నాపూరంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థి గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాఘవేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దాసుయాదవ్, చెన్నప్పయాదవ్, మాసిరెడ్డి, ఆంజనేయరెడ్డి, రఘురాంరెడ్డి పలువురు ఉన్నారు.

కార్పొరేషన్ల ఏర్పాటు హర్షణీయం

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్రంలో మున్నూరు కాపు కోసం కార్పొరేషన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమని మున్నూరు కాపు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక పవర్ డిప్లొమా ఇంజినీరింగ్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్కలు ప్రత్యేక చొరవతో రాష్ట్ర క్యాబినెట్‌లో మున్నూరుకాపు కార్పొరేషన్ ప్రకటించడం హర్షణీయమని అన్నారు. గత ప్రభుత్వం మున్నూరు కాపులను చిన్నచూపు చూసిందన్నారు. సమావేశంలో బుక్కా స్వామి, గోనెల వెంకటేశ్వర్లు, నర్సిరెడ్డి, పాశం గోపాల్, లక్ష్మయ్య, వెంకటస్వామి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

కోయిల్‌కొండ: ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ప్రకటించడంపై ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు అశోక్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కొన్నేళ్లుగా ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎన్నో విధాలుగా పోరాటాలు చేసినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఈ ప్రభుత్వం ఆర్యవైశ్యుల అభివృద్ధికి సహకరించడం సంతోషం అన్నారు.

ఇసుక అనుమతి ఇవ్వాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మిడ్జిల్: మండలంలోని అయ్యవారిపల్లిలో సీజ్ చేసిన ఇసుకను మహబూబ్‌నగర్ ఆస్పత్రి నిర్మాణానికి అనుమతులు ఇచ్చినట్లే, మండల ప్రజల అవసరాలకు, ప్రభుత్వ పనులకు మైనింగ్ అధికారుల పర్యవేక్షణలో అనుమతులు ఇవ్వాలని బీజేపీ నాయకులు గురువారం తహసీల్దార్ రాజునాయక్ వినతిపత్రం ఇచ్చారు. మండల అవసరాలు తీరిన తర్వాత ఇతర ప్రాంతాలకు అనుమతులు ఇవ్వాలని కోరారు. జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, బాలత్రిపురసుందరి, నరేందర్, తిరుపతి, రవీందర్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, వాస్‌దేవ్, అంజి తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో కలశాభిషేకం



నవాబుపేట మైసమ్మ ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు

నవాబుపేట: మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ దేవాలయంలో 15వ వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం 108 కలశాలతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. దేవాలయ వార్షికోత్సవాలు ముగింపు సందర్భంగా కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించినట్లు చైర్మన్ కృష్ణయ్య, దేవాయల అధికారి మధ నేశ్వర్‌రెడ్డి తెలిపారు.

ప్రారంభమైన దేవాలయ ఉత్సవాలు

జంగమయ్యపల్లిలో గురువారం హనుమాన్ దేవాలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఏర్పాటు చేసే విగ్రహాలు, ధ్వజస్తంభం తదితర వాటిని శుద్ధిచేసి ఊరేగింపు చేపట్టారు. శుక్రవారం జలదివాసం, ధాన్య దివాసం చేసి శనివారం ధ్వజ స్తంభం, బొడ్రాయి, ఉత్సవమూర్తుల ప్రతిష్ఠ, బోనాల కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



జంగమయ్యపల్లిలో జలాల ఊరేగింపులో గ్రామస్తులు

పదోతరగతిలో ప్రతిభ చూపాలి



మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ

దేవరకద్ర: పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపాలని సీఐ రామకృష్ణ సూచించారు. గురువారం కౌకుంట్ల మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో సీఐ పాల్గొని ప్రసంగించారు. పదో తరగతి ఒక మైలురాయి వంటిదని చెప్పారు. చదివిన పాఠశాల కు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. పదితో తమ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. తహసీల్దార్ ఎల్లయ్య, హెచ్‌ఎం సుమన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.500 ఇస్తేనే టెన్త్ హాల్‌టికెట్



భూత్పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

భూత్పూర్: ప్రభుత్వ పాఠశాలలో తమ విద్యార్థులను చేరిపించడం తల్లిదండ్రులకు శాపంగా మారింది. 18 నుంచి నిర్వహించే పదో తరగతి పరీక్షలకు మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో హాల్‌టికెట్ ఇస్తుండగా, ఒక్క భూత్పూర్ ఉన్నత పాఠశాలలో ఒక్కో విద్యార్థి రూ.500 ఇస్తేనే హాల్‌టికెట్ ఇస్తామని చెప్పారు. విద్యార్థులు వారి తల్లిదండ్రుల సమాచారం .. ఉన్నత పాఠశాలలో వంద మంది విద్యార్థులు తెలుగు, ఇంగ్లిషు మీడియం విద్యనభ్యసిస్తున్నారు. రెండు రోజులుగా హాల్‌టికెట్ కోసం విద్యార్థులు హెచ్‌ఎం ఆనందమ్మను అడగడంతో హాజరు శాతం తగ్గిందని, ప్రీ ఫైనల్ పరీక్షలు రాయలేదని నెపంతో రూ.500 తీసుకరావాలని, డబ్బులు ఇస్తేనే హాల్‌టికెట్ ఇస్తామని విద్యార్థులకు చెప్పారు. దీంతో విద్యార్థులు కొంత మంది తప్పని పరిస్థితిలో డబ్బులు చెల్లించగా, ఆర్థిక ఇబ్బందులతో కొంత మంది ఇవ్వకపోగా బుధవారం జిల్లా కేంద్రం నుంచి ఏబీవీపీ నాయకులు హెచ్‌ఎంను నిలదీశారు. గురువారం విద్యార్థులకు హాల్‌టికెట్‌లు అందజేస్తామని చెప్పడంతో వారు వెళ్లిపోగా, గురువారం హెచ్‌ఎం డబ్బుల తీసుకురావాలని విద్యార్థులపై ఒత్తిడి తెచ్చారు. ఈ విషయమై ఎంఈఓ నాగయ్యను వివరణ కోరగా.. ప్రభుత్వ పాఠశాలలో హాల్‌టికెట్ కోసం డబ్బులు అడిగితే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ విషయంపై హెచ్‌ఎం ఆనందమ్మను వివరణ కోరగా విద్యార్థులను డబ్బులు తీసుకురమ్మని చెబితే, వారి తల్లిదండ్రులు పాఠశాలకు వస్తారనే భావంతో డబ్బులు ఇస్తేనే హాల్‌టికెట్ ఇస్తామని చెప్పామన్నారు. విద్యార్థుల హాజరు శాతం తగ్గడంతో పాటు ప్రీ ఫైనల్ పరీక్షలు సైతం రాయకపోవడంతో తల్లిదండ్రులతో చర్చించేందుకు మాత్రమే చెప్పామని హెచ్‌ఎం వివరణ ఇచ్చారు.

ఎస్‌హెచ్‌జీ సభ్యులకు ఇన్సూరెన్స్ స్కీమ్ అమలు

- ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున
- బ్యాంక్ లింకేజీ ప్రోగ్రాం కింద సభ్యులకు క్రెడిట్ లింక్డ్ రిస్క్ కవరేజీ వర్తింపు
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 64.35 లక్షల మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు (గ్రామీణ, పట్టణ) ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీమ్‌ను అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రమాదవశాత్తూ ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు మరణించిన పక్షంలో ఈ ప్రమాద బీమా వర్తించేలా చర్యలు చేపట్టనున్నారు. ఈ ఇన్సూరెన్స్ స్కీమ్ గురువారం నుంచే అమల్లోకి రానున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు ఈ పథకాన్ని పేర్కొందిన ఇన్సూరెన్స్ సంస్థ ద్వారా (తక్కువ ప్రీమియం ఉండేలా) అమలు చేయాల్సిందిగా స్త్రీనిధి ఎండీని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు పంచాయతీ రాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీచేశారు.

లోన్ బీమా కూడా వర్తింపు

అదేవిధంగా బ్యాంక్ లింకేజీ ప్రోగ్రాం కింద 64.35 లక్షల ఎస్‌హెచ్‌జీ సభ్యులకు (గ్రామీణ, పట్టణ) క్రెడిట్ లింక్డ్ రిస్క్ కవరేజీ (లోన్ బీమా)ని వర్తింపజేస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. రుణాలు తీసుకున్న సభ్యుల్లో ఎవరైనా చనిపోతే గరిష్టంగా రూ.2 లక్షల వరకు రిస్క్ కవరేజీ ఇచ్చేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ పథకం కూడా గురువారం నుంచి అమల్లోకి వచ్చినట్టు ప్రకటించారు. ఈ మేరకు పీఆర్ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా విడిగా ఉత్తర్వులు జారీచేశారు.

కొత్త బాసు రాకముందే
ఖాళీ చేయాలని..!

ట్యాపింగ్ ఆధారాలను ధ్వంసం చేసే కుట్ర చేసిన ఎస్ఐబీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు

- ఎన్నికల ఫలితాలు రావడంతో డిసెంబర్ 4న రాజీనామా
- అదే రోజు రాత్రి ప్రణీత్‌రావును ఎస్ఐబీకి పంపిన వైనం
- ట్యాపింగ్ కేసులో దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు
- త్వరలో ప్రభాకర్‌రావు సహా మరికొందరికి నోటీసులు



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీఆర్ఎస్ పార్టీ ఓడిపోవడం... ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ) హోదాలో అప్పటివరకు స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరోకు (ఎస్ఐబీ) నేతృత్వం వహించిన టి.ప్రభాకర్‌రావు రాజీనామా చేయడం ... త్వరలో ఆ విభాగానికి మరో బాస్ వచ్చే అవకాశం ఉండటం... ఈ పరిణామాల నేపథ్యం లోనే గత డిసెంబర్ 4న రాత్రే ఎస్ఐబీ ఆఫీస్‌లోని 'వార్ రూమ్'ను మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు ధ్వంసం చేసినట్లు అధికారులు గుర్తించారు. ప్రణీత్‌ను బుధవారం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించిన పంజగుట్ట పోలీసులు తదుపరి విచారణ కోసం కస్టడీకి కోరుతూ గురువారం నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను వెనక్కు ఇచ్చిన న్యాయస్థానం అదనపు పత్రాలతో శుక్రవారం మళ్లీ దాఖలు చేయాలని ఆదేశించింది.

డీఎస్పీగా చేరి ఓఎస్డీగా రాజీనామా...

1991లో డీఎస్పీగా పోలీసు విభాగంలో అడుగుపెట్టిన టి.ప్రభాకర్‌రావు 2001లో ఐపీఎస్ హోదా పొంది ఐజీగా పనిచేస్తూ 2020 జూన్‌లో పదవీ విరమణ పొందారు. అదే ఏడాది నవంబర్ 3న ప్రభాకర్‌రావును ఓఎస్డీ హోదాలో ఎస్ఐబీలో నియమించారు. అప్పట్లో నిఘా విభాగానికి నేతృత్వం వహించిన నవీన్ చంద్ పదవీ విరమణ చేయడంతో తాత్కాలికంగా ఆ బాధ్యతల్నీ ప్రభాకర్‌రావుకే అప్పగించారు. అప్పటి నుంచే ఈ అక్రమ ట్యాపింగ్ వ్యవహారాలకు బీజం పడిందని అనుమానిస్తున్నారు. నిఘా విభాగానికి అనిల్ కుమార్‌ను బాస్‌గా నియమించిన అప్పటి ప్రభుత్వం ప్రభాకర్‌రావును ఎస్ఐబీకి పరిమితం చేసింది. అప్పటి నుంచి ఎక్స్‌టెన్షన్‌పై కొనసాగుతూ వచ్చిన ప్రభాకర్‌రావు గత డిసెంబర్ 4న రాజీనామా చేశారు.

ఒకట్రెండు రోజుల్లో ఎస్ఐబీకి మరో అధికారిని నియమించే అవకాశం ఉండటంతో తమకు ఇబ్బంది లేకుండా, తక్షణం ట్యాపింగ్‌కు సంబంధించిన ఆధారాలు చెరిపేయాలని ప్రణీత్ రావుకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో వార్ రూమ్‌లు ఖాళీ చేసి, ట్యాపింగ్ ఆధారాలు ధ్వంసం చేయడానికి ఇతడు సిద్ధమైనట్లు పోలీసులు చెప్తున్నారు.

హార్డ్‌డిస్క్‌ల్ని కట్టర్లతో కట్ చేశారు

ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు ప్రణీత్ ఓ ఎలక్ట్రీషియన్‌తో కలిసి ఎస్ఐబీ కార్యాలయంలోకి వెళ్లాడు. అక్కడ వార్ రూమ్‌తోపాటు అధికారిక ట్యాపింగ్స్ జరిగే లాగర్ రూమ్ దగ్గర సీసీ కెమెరాలను ఆఫ్ చేయించాడు. 17 కంప్యూటర్లలో ఉన్న వాటితోపాటు విడిగా భద్రపరిచిన 50 హార్డ్‌డిస్క్‌ల్నీ ధ్వంసం చేయడానికి ఉపక్రమించాడు. ఎలక్ట్రీషియన్ తోపాటు నమ్మినబంటుగా ఉన్న ఓ పోలీసు సహాయంతో ఎలక్ట్రిక్ కట్టర్ వినియోగించి ఈ హార్డ్‌డిస్క్‌లు ధ్వంసం చేశాడు. ఎస్ఐబీ అనునిత్యం మావోయిస్టులకు సంబంధించిన సమాచారం సేకరిస్తూ, వారిపై నిఘా ఉంచుతుంది. ఈ నేపథ్యంలోనే మావోయిస్టుల తోపాటు వారి సానుభూతిపరులు, వారితో వివి ధ రకాలైన సంబంధాలు కలిగిన వారి వివరా లను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ నిక్షిప్తం చేస్తుంటుంది. ఎస్ఐబీ దృష్టిలో ఇది అత్యంత విలువైన డేటా. ప్రణీత్ ధ్వంసం చేసిన హార్డ్‌డిస్క్‌ల్లో ఈ డేటా ఉందని, ఇప్పుడు దాన్ని తిరిగి పొందటం సాధ్యం కాదని అధికారులు చెప్తున్నారు. ఆ కోణంలోనూ ప్రణీత్‌ను విచారించనున్నారు. ప్రణీత్‌ను పోలీసు కస్టడీలోకి తీసుకుని విచారించిన తర్వాత ప్రభాకర్‌రావు సహా మరికొందరికి నోటీసులు జారీ చేయాలని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు.

రైతులు, నిరుద్యోగుల
ఆస్తులు తాకట్టు పెట్టుకోవద్దు

- బ్యాంకర్లకు డిప్యూటీ సీఎం భట్టి సూచన
- రైతుల విషయంలో మానవతా దృక్పథంతో వ్యవహరించండి
- ఎస్‌హెచ్‌జీల మహిళలకు ఎక్కువ రుణాలివ్వండి
- మంత్రి తుమ్మలతో కలిసి ఎస్ఎల్‌బీసీ భేటీకి హాజరు



సాక్షి, హైదరాబాద్: రైతులు, నిరుద్యోగులకు రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకర్లు వారి ఆస్తులను తాకట్టు పెట్టుకోవడం సరైంది కాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రైతుల విషయంలో బ్యాంకులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా బ్యాంకర్లు వారికి ఎక్కువ రుణాలు ఇవ్వాలని కోరారు. స్వయం ఉపాధి కోసం యువతకు కూడా రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గురువారం బేగంపేటలోని ఒక ప్రైవేట్ హోటల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్‌బీసీ) 40వ త్రైమాసిక సమావేశానికి వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి భట్టి హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్యాంకర్లను ఉద్దేశించి మాట్లాడారు.

రుణ వితరణ సామాజిక బాధ్యతగా గుర్తించాలి

రుణాలు ఇవ్వడం సామాజిక బాధ్యతగా బ్యాంకర్లు గుర్తించాలని భట్టి విజ్ఞప్తి చేశారు. సంపద సృష్టికర్తలకు బ్యాంకర్లు తోడ్పాటు ఇవ్వడం వల్ల సంపదను ప్రజలకు పంచవచ్చని వివరించారు. రైతులకు రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అసహనం ప్రదర్శిస్తే వారు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి రుణ భారం తీరక ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గత పాలనలో లావాదేవీలు జరగని ఖాతాలకు సంబంధించిన రైతులకు మళ్లీ రుణాలు ఇవ్వాలని చెప్పారు. రానున్న ఐదేళ్లలో డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.లక్ష కోట్ల వడ్డీ రహిత రుణాలు అందించాలని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. వ్యాపారంలో విఫలమైన ఈము రైతులకు రుణాల చెల్లింపుల విషయంలో వన్ టైం సెటిల్మెంట్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. తాను ఆంధ్రా బ్యాంకు డైరెక్టర్‌గా ఉన్న సమయంలో విద్య రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు ప్రారంభం అయ్యాయని, 20 ఏళ్లు అవుతున్నా ఆ రుణాల జారీలో ప్రగతి కనిపించడం లేదని అన్నారు.

ప్రభుత్వ పథకాలకు సహకరించండి: తుమ్మల

ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాల్లో ప్రజా ప్రాధాన్యత ఉన్న వాటిని గుర్తించి వాటిని ముందుకు తీసుకెళ్లడానికి బ్యాంకర్లు సహకరించాలని మంత్రి తుమ్మల కోరారు. రుణాలు ఇచ్చే విషయంలో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పాడి పరిశ్రమలు నెలకొల్పడానికి ముందుకు వచ్చే రైతులకు బ్యాంకర్లు రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా పట్టు గూళ్ల పెంపకం రైతులకు రూ.1.83 కోట్ల ప్రోత్సాహక చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎస్‌బీఐ సీజీఎం రాజేష్‌కుమార్, ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ మిత్ర, నాబార్డ్ జీఎం పీపీ ఉషా తదితరులు పాల్గొన్నారు.

రూ. 49,501 కోట్ల పంట రుణాలు: ఎస్ఎల్‌బీసీ

రాష్ట్రంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో రైతులకు రూ.49,501 కోట్ల పంట రుణాలు ఇచ్చినట్లు ఎస్ఎల్‌బీసీ వెల్లడించింది. లక్ష్యంలో 67.41 శాతం చేరుకున్నట్లు గురువారం విడుదల చేసిన నివేదికలో తెలిపింది. రూ.624 కోట్ల మేర విద్యా రుణాలు, రూ.2,890 కోట్ల గృహ రుణాలు ఇచ్చినట్లు తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు రూ.7,55,800 కోట్లకు చేరాయని వివరించింది.

సింగరేణిలో సేఫ్టీ 'నోమ్'

- భూగర్భ గనుల్లో ప్రమాదాల నివారణకు ఆస్ట్రేలియా టెక్నాలజీ వినియోగం
- ప్రయోగాత్మకంగా ఒక గనిలో అమలుకు అంగీకారం
- వివరాలు వెల్లడించిన సింగరేణి సీఎండీ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భూగర్భ గనులను నూరుశాతం ప్రమాదరహితంగా మార్చేందుకు 'సింగరేణి' అంతర్జాతీయస్థాయి ఆధునిక సాంకేతికతను పరిశీలిస్తోందని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ తెలిపారు. భూగర్భగనుల్లో పైకప్పు కూలి జరిగే ప్రమాదాలను నివారించడానికి ఆస్ట్రేలియాకు చెందిన నోమ్ అనే సంస్థ కొత్తగా రూపొందించిన ఆధునిక పరికరాల పనితీరును హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం సంస్థ ఉన్నతస్థాయి అధికారులతో చర్చించారు. భూగర్భగనుల్లో రక్షణ చర్యలెన్ని తీసుకుంటున్నా, అకస్మాత్తుగా పైకప్పు కూలి కార్మికులు మృతి చెందిన ఘటనలు గతంలో అనేకం జరిగాయని ఈ సమావేశంలో అధికారులు అభిప్రాయపడ్డారు.



ఆస్ట్రేలియాకు చెందిన నోమ్ సంస్థ రూపొందించిన యంత్రం పనితీరును తెలుసుకుంటున్న సింగరేణి సీఎండీ ఎన్ బలరాం

నోమ్ సంస్థ రూపొందించిన పరికరం గనిలో పైకప్పు ప్రమాదం జరగకముందే ఫ్లాష్ లైటింగ్, సైరన్‌ల ద్వారా అక్కడ పనిచేస్తున్న కార్మికులు, అధికారులను హెచ్చరించి అప్రమత్తం చేస్తుందని, దీంతో ప్రమాదం నివారించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకొని, ప్రాణనష్టం జరగకుండా చూసే అవకాశం ఏర్పడుతుందని అన్నారు. ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏదైనా ఒక భూగర్భగనిలో వినియోగిస్తామని, అక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా తదుపరి నిర్ణయం తీసుకుంటామని సీఎండీ వెల్లడించారు. ఈ సమావేశంలో డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ జి.వెంకటేశ్వర్ రెడ్డి, జనరల్ మేనేజర్ (ఆర్అండ్‌డీ) సుభాని తదితరులు పాల్గొన్నారు. కాగా నోమ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నాథన్‌ఓవెన్, జనరల్ మేనేజర్ కేసన్‌ఫిన్‌లెన్ డెమోస్ట్రేషన్ ద్వారా యంత్రం పనితీరు గురించి అధికారులకు వివరించారు.

ఆ విలేకరులను క్షమించేది లేదు – టీయూడబ్ల్యూజే, ఐజేయూ

సాక్షి, హైదరాబాద్: గొలుసు కట్టు మనీ స్కీమ్‌కు ఒక కుటుంబం బలైన దుర్ఘటనలో కొంతమంది విలేకరుల పాత్ర ఉండటం అత్యంత విచారకరమని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే), ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) పేర్కొన్నాయి. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలోని టంగుటూరు గ్రామంలో జరిగిన ఘటన మీడియాలోని ప్రతి ఒక్కరూ తలదించుకునేలా చేసిందని ఆ సంఘాలు విచారం వ్యక్తం చేశాయి. మీడియా ప్రమాణాలను, గౌరవాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీయూడబ్ల్యూజే, ఐజేయూ గురువారం విడుదల చేసిన ప్రకటనలో విజ్ఞప్తి చేశాయి. వాస్తవాలను రాయకుండా ఉండడానికి ఒక వ్యక్తి వద్ద డబ్బులు డిమాండ్ చేసిన విలేకరులు వృత్తికి ద్రోహం చేయడమే గాకుండా ఆ క్రమంలో నలుగురి ప్రాణాలు పోవడానికి కారకులయ్యారని టీయూడబ్ల్యూజే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగునూరి శేఖర్, కె.విరాహత్ అలీ, ఐజేయూ కార్యదర్శి వై నరేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

రఘువీర్‌ప్రతాప్‌కు పురస్కారం



పెద్దకొత్తపల్లి: మండలంలోని కల్వకోలు చెందిన అటవీ శాఖ పర్యవేక్షణ అధికారి ఎస్‌వీ రఘువీర్ ప్రతాప్‌కు ప్రతిష్టాత్మకమైన పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారాన్ని గజల్ ప్రక్రియలో ప్రకటించింది. ఈ నెల 20న ఆయనకు ఈ అవార్డును అందజేయనున్నట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ తెలిపారు. ఈయన కవి, రచయిత, చిత్రకారుడు, నటుడు, గాయకుడు, సాహిత్య కళాపీఠం వ్యవస్థాపకుడు. కల్వకోలు చెందిన నారాయణదాసు, వెంకటశేషమ్మ దంపతుల కుమారుడైన రఘువీర్ ప్రతాప్, గ్రామంలోనే ఉన్నత విద్యను అభ్యసించారు. ఇంటర్ మహబూబ్‌నగర్ జూనియర్ కళాశాల, బీఏ డిగ్రీ ఎస్‌వీఈఎస్ కళాశాల హైదరాబాద్‌లో చదివారు. ప్రస్తుతం అటవీ శాఖ పర్యవేక్షణాధికారిగా నల్లగొండలో విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు కవిత్వంలో 3 పుస్తకాలు రాశా రు. సాహిత్య పరంగా స్వర్ణకంకణ, సాహిత్య రత్నా, కవితాశ్రీ బిరుదులు అందుకున్నారు.

బీసీలను విస్మరించిన పార్టీలకు బుద్ధి చెబుతాం



స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రధాన రాజకీయ పార్టీలు బీసీలను విస్మరించి, అగ్రవర్ణాలకే ఎంపీ టికెట్లు కేటాయించాయని.. ఎన్నికల్లో ఆయా పార్టీలకు తగిన బుద్ధి చెబుతామని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాస్ సాగర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో 65 శాతం ఉన్న బీసీల అభిప్రాయం పరిగణనలోకి తీసుకోకుండా మూడు ప్రధాన పార్టీలు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారిని ఎంపీ అభ్యర్థులుగా ప్రకటించడం తగదన్నారు. ఆయా పార్టీల్లో బీసీలు లేరా.. వాళ్లకు గౌరవం లేదా.. బీసీలు ఎంపీలుగా పోటీచేసే అర్హత లేదా అని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో అన్ని సంఘాల మద్దతుతో మన ఓటు మనమే వేసుకుందాం అనే నినాదంతో బీసీ సమాజ్ ముందుకెళ్తుందన్నారు. ఈ ఎన్నికల్లో బీసీల సత్తా చాటుతామన్నారు. పద్మశాలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సారంగి లక్ష్మీకాంత్, నాయీబ్రాహ్మణ సేవాసంఘం నాయకుడు డీకే నాయీ, జాంబ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్, బీసీ సమాజ్ నియోజకవర్గ కన్వీనర్ బి.శేఖర్, రజక రిజర్వేషన్ సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.సత్యం ఉన్నారు.

అందుబాటులోకి వచ్చేనా?

పాలమూరులో వాలీబాల్ అకాడమీ పునః ప్రారంభం

- రాష్ట్రస్థాయి ఎంపికలు జరిగి 15 నెలలు..
- క్రీడాకారుల ప్రవేశాలపై సందిగ్ధం
- ఇప్పటికే సమకూరిన వసతి సౌకర్యాలు



అకాడమీకి వచ్చిన సామగ్రి

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ 2004లో పాలమూరుకు వాలీబాల్ అకాడమీ మంజూరు చేసింది. ఈ అకాడమీలో శిక్షణ పొందిన జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు అంతర్జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. అకాడమీలో ఓనమాలు నేర్చుకొని దేశానికి ప్రాతినిధ్యం వహించారు. అప్పట్లో ఈ అకాడమీ రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. నాలుగేళ్ల పాటు సజావుగా సాగినా.. తర్వాత నిర్వహణ భారంతో 2008లో మూసివేశారు.

ప్రధాన స్టేడియంలోనే తిరిగి ఏర్పాటు..

ప్రధాన స్టేడియంలోనే రెండేళ్ల కిందట రూ.19.70 లక్షలతో వాలీబాల్ అకాడమీ తిరిగి ప్రారంభించారు. స్టేడియం ఆవరణలోని స్విమ్మింగ్‌పూల్ పైఅంతస్తు గదులను అకాడమీ క్రీడాకారుల వసతి కోసం కేటాయించారు. గదుల ఆధునీకీకరణ పనులు కూడా పూర్తి చేశారు. స్టేడియంలోని రెండు పాత వాలీబాల్ కోర్టులను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. కోర్టుల చుట్టూ నాలుగు ఫ్లడ్‌లైట్లు, ప్రత్యేక షెడ్లు, గ్యాలరీతో పాటు ప్రహరీని వాలీబాల్ క్రీడా చిత్రాలతో ఆకర్శణీయంగా తీర్చిదిద్దారు.

అకాడమీలో ప్రవేశాలపై సందిగ్ధం..

వాలీబాల్ అకాడమీలో ప్రవేశాల కోసం గతేడాది డిసెంబర్ 1న అండర్ 14–18 బాల బాలికల ఎంపికలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 187 మంది బాలురు, 46 మంది బాలికలు మొత్తం 233 మంది సెలక్షన్స్‌కు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ కనబర్చిన వారిని అకాడమీకి ఎంపిక చేసినా.. 15 నెలలు గడుస్తున్నా నేటికీ ప్రవేశాలు కల్పించలేదు. కనీసం కోచ్‌ల నియమకాలు కూడా చేపట్టలేదు. ఎంపికలు జరిగి 15 నెలలు దాటడంతో పాతవారికి ప్రవేశాలు ఇస్తారా లేక మళ్లీ ఎంపికలు నిర్వహిస్తారా అనే దానిపై సందిగ్ధం నెలకొంది.



వాలీబాల్ కోర్టులు

త్వరలో ప్రవేశాలు..



జిల్లాకేంద్రంలోని ప్రధాన స్టేడియంలో ఉన్న వాలీబాల్ అకాడమీకి ఇప్పటికే కొంత సామగ్రి వచ్చింది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ నుంచి ఆదేశాలు రాగానే ప్రవేశాలు జరుగుతాయి. అకాడమీ ఏర్పాటుతో నైపుణ్యం గల క్రీడాకారులను వెలికితీయవచ్చు. క్రీడాకారులకు మెరుగైన, ఉత్తమమైన శిక్షణ అందనుంది.

– ఎస్.శ్రీనివాస్, డీవైఎస్ఓ, మహబూబ్‌నగర్

నాగర్‌కర్నూల్‌కు మోదీ చేసిందేమీ లేదు..

కొల్లాపూర్ రూరల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సెగ్మెంట్‌కు ప్రధాని మోదీ చేసిందేమీలేదని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. గురువారం కొల్లాపూర్ మండలం సింగోటంలో పాదయాత్ర నిర్వహించారు. ముందుగా లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏనాడూ పట్టించుకోలేదన్నారు. ఈ గడ్డమీద సభ పెట్టే అర్హత బీజేపీకి లేదన్నారు. ఇక్కడ ఎంపీ అభ్యర్థిని అరువుకు తెచ్చుకున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రజాపాలన కొనసాగుతుందన్నారు. అన్ని వర్గాలకు మేలు చేకూరుతోందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. సామాజిక సమీకరణల మేరకు నాగర్‌కర్నూల్ అభ్యర్థి ఎంపిక ఉంటుందన్నారు. పార్టీ టికెట్ కోసం 26 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు.



సింగోటంలో పాదయాత్ర చేస్తున్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

టికెట్ విషయంలో అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటామన్నారు. అనంతరం కొల్లాపూర్‌కు చేరుకుని జగ్జీవన్‌రాం, అంబేడ్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఖాదర్‌పాషా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఎండీ ఎక్బాల్, రఘుపతిరావు, మాజీ సర్పంచ్‌లు వెంకటస్వామి, కొమ్మురాజు, బాల్‌రాజు, నాయకులు లక్ష్మయ్య, రామకృష్ణ కౌన్సిలర్ నహీమ్, అన్వర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు ఏకపక్షమే



ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డిని పరిచయం చేస్తున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

అలంపూర్/ వనపర్తి: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఏకపక్షమేనని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని ఏజీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల బీఆర్ఎస్ అభ్యర్థితో గురువారం పరిచయ వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీమంత్రితోపాటు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీమంత్రి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీలు దరిదాపుల్లో లేవన్నారు. ఉమ్మడి జిల్లాలో 1,439 ఓటర్లు ఉండగా.. 1,050 మంది బీఆర్ఎస్ నుంచి గెలిచిన వారే ఉన్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోనే బీఆర్ఎస్‌ను నిలబెట్టింది జోగుళాంబ గద్వాల అని పేర్కొన్నారు. అలాగే అధికార పార్టీ ప్రలోభాలకు లోనుకాకుండా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేసి నవీన్ కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కేసీఆర్ కానుకగా ఇద్దాం..

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి నవీన్‌రెడ్డిని గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇద్దామని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి చెప్పారు. వనపర్తి జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలోని ఓటర్లు అందరూ నైతిక విలువలతో ఓటు వేయాలని కోరారు. నవీన్‌రెడ్డిని గెలిపించడంతోపాటు అదే స్ఫూర్తితో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో విజయం కోసం కృషి చేయాలన్నారు. సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామరెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ గుర్తుతో గెలుపొందిన కౌన్సిలర్లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు విలువలతో పార్టీ బలపరిచిన అభ్యర్థికే ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఉన్నత అభ్యాసంతోనే అభివృద్ధి



వైద్యులను సన్మానిస్తున్న ప్రతినిధులు

- ఎఫ్ఓజీఎస్ఐ చైర్మన్ డాక్టర్ కిరణ్మయి

పాలమూరు: లింగ వివక్ష, మహిళ ఉన్నత అభ్యాసంతోనే దేశ అభివృద్ధిగా భావించాలని ఎఫ్ఓజీఎస్ఐ చైర్మన్ డాక్టర్ కిరణ్మయి అన్నారు. జనరల్ ఆస్పత్రిలో గురువారం ప్రైవేట్, ప్రభుత్వ మహిళ వైద్యులకు మహిళా సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, వారి సాటి మహిళలను ఏ కారణాల చేత అయిన అగౌరవపరచరాదన్నారు. ప్రతి మహిళ తనకు తానుగా ఆరోగ్య పరిరక్షణ చేసుకోవాలన్నారు. లింగ సమానత్వం కోసం పాటుపడాలని, మహిళలపై జరుగుతున్న అకృత్యాల కట్టడి కోసం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సదరు వ్యక్తులపై చర్యలు తీసుకునేలా పోరాటం చేయాలన్నారు. అనంతరం జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జీవన్ మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో ఎదిగినప్పుడే నిజమైన మహిళా సాధికారత సాధించినట్లు అవుతుందన్నారు. నారాయణపేట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకిషన్ మాట్లాడుతూ ప్రకృతికి సరిసమానమైన మహిళలను కించపరచడం అత్యంత హేయమైన చర్య అన్నారు. ఇలాంటి విషయాలను ప్రతి పురుషుడు ఖండించి వారికి మద్దతుగా నిలవాలన్నారు. గైనిక్ హెచ్‌వోడీ డాక్టర్ రాధ మాట్లాడుతూ సరోజినీ నాయుడు పుట్టిన రోజు సందర్భంగా ప్రతి ఏడాది ఫిబ్రవరి 13న జాతీయ మహిళా దినోత్సవం జరుపుకొంటామని, ప్రతి మహిళ సరోజిని నాయుడు అంత శక్తివంతంగా మారాలన్నారు. ప్రతి మహిళ అత్యవసర సమయాల్లో 1091 టోల్ ఫ్రీ, గృహ హింస సమయంలో 181 టోల్ ఫ్రీని సంప్రదించాలన్నారు. ప్రభుత్వం అందించే సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా వైద్యులు లక్ష్మీపద్మప్రియ, ఆశాజ్యోతి, ఎఫ్ఓజీఎస్ఐ కమిటీ ప్రెసిడెంట్ అపర్ణ, నర్సింగ్ సూపరింటెండెంట్ అల్బీనా, సఖీ సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

రామన్‌పాడులో తగ్గుతున్న నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో నీటి మట్టం రోజురోజుకూ తగ్గుతోంది. గురువారం నీటి మట్టం 1,014 అడుగులకు చేరింది. కొత్తపల్లి ఊక చెట్టు వాగు వంతెన కింద నీటి మట్టం తగ్గింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వలకు నీటిని నిలిపేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.